తెలుగు దినపత్రిక

# ఇదే నిజం
వార్తలు

towards truth..

www.Idenijamdaily.com

| రంగారెడ్డి, మేడ్చల్ | మంగళవారం | 27.10.2026 | సంపుటి : 1 | సంచిక :324 | పేజీలు : 8 | వెల : 4/- |
|---|---|---|---|---|---|---|
| RANGAREDDY, MEDCHAL | Tuesday | 27.10.2026 | volume : 1 | Issue : 324 | Pages : 8 | Cost : 4/- |




లాభాల్లో ముగిసిన సూచీలు 08


## రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి 'ఇదే నిజం' ఆహ్వానం పలుకుతున్నది 'ఇదే నిజం' తెలుగు దిన పత్రికలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో పని చేయుటకు రిపోర్టర్లు కావలెను.

**అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం**

**సెల్ : 9492652230**


## ఖర్గే వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు

ప్రధాని మోదీ తల్లిదండ్రులపై కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న అభ్యంతరకర వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ..ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పట్నా సభలో ప్రధాని తండ్రిని ఉద్దేశించి అవమానకర వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన చర్యగా అభివర్ణించారు.



**హైదరాబాద్, అక్టోబర్ 26 :** అధికారం కోసం కాంగ్రెస్ నాయకులు నైతిక విలువలను పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అహంకారపూరిత వైఖరికి నిరసనగా హైదరాబాద్ సహా తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మల దహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 'సర్' ప్రక్రియలో సీఎం సొంతూరిలో అర్హుల ఓట్లు డిలీట్ అయ్యాయో చూపించగలరా

-మిగతా 2 లో..

తెలంగాణలో వానాకాలం వరి ధాన్యం ధరలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. ఒకవైపు సన్న రకాల ధాన్యానికి ఆశించిన దానికంటే అధిక ధరలు లభిస్తుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మరోవైపు బియ్యం ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది. మహబూబాబాద్ జిల్లా కేశముద్రం వ్యవసాయ మార్కెట్‌లో జై శ్రీరామ్ రకం ధాన్యం క్వింటాలుకు ఏకంగా రూ.5,016 పలకడం మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో సన్న రకం వడ్లకు రూ.3,000 నుంచి రూ.3,500 వరకు, మరికొన్ని రకాలకు అంతకంటే ఎక్కువ ధర లభిస్తోంది. అదే సమయంలో రిటైల్ మార్కెట్‌లో సన్న బియ్యం కిలో ధర రూ.90 నుంచి రూ.100 వరకు చేరినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో రైతుకు ధర పెరిగినా.. వినియోగదారుడికి మాత్రం ఖర్చు తప్పడం లేదు.

# వడ్లు పైపైకి..
# బియ్యం భగ్గు!



### క్వింటాలు రూ.5,016.. కిలో రూ.100!

### తెలంగాణ మార్కెట్‌లో ధరల రికార్డు..

### రైతుకు ఆనందం.. వినియోగదారుడికి ఆందోళన!

**తెలంగాణ బ్యూరో, అక్టోబర్26(ఇదేనిజం) :** తెలంగాణలో సన్న రకం ధాన్యానికి పొరుగు రాష్ట్రాల నుంచి డిమాండ్ పెరగడం ధరల పెరుగుదలకు ఒక కారణంగా కనిపిస్తోంది. కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు, రైస్ మిల్లర్లు ఇక్కడి ధాన్యం కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. కొనుగోలుదారుల మధ్య పోటీ పెరగడంతో నాణ్యమైన సన్న రకాల వడ్లకు అధిక ధరలు లభిస్తున్నాయి. జై శ్రీరామ్ రకంతోపాటు ఆర్ఎస్ఆర్ వంటి రకాల ధాన్యానికి కూడా క్వింటాలుకు రూ.4,300 వరకు ధర పలుకుతున్నట్లు మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. నల్గొండ, కరీంనగర్,

-మిగతా 2 లో..



## రాజీనామా చేసి.. వేరే పార్టీలోకి వెళ్లొచ్చు

### అది రాజకీయ ప్రక్రియలో భాగమే

### సుప్రీం కోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, అక్టోబర్ 26 : తమిళనాడులో ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, అధికార టీవీకే లో చేరిన కేసులో సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. వేరే పార్టీకి వెళ్లాలనుకున్న వారు రాజీనామా చేసే వెళ్తారని.. అది రాజకీయ ప్రక్రియలో భాగమని స్పష్టం చేసింది. రాజీనామా, అనర్హత వేటు అనేవి వేర్వేరు రాజ్యాంగ ప్రక్రియలు అని.. వాటిపై పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాజీనామాలను ఆమోదించే అధికారం స్పీకర్‌కు ఉంటుందని తెలిపింది. అనర్హత పిటిషన్ విచారణను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఆరుగురు ఎమ్మెల్యేల రాజీనామాలు, పార్టీ మార్పుపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. పార్టీ మారిన ఆరుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలను ఐదేళ్లపాటు

మిగతా 2 లో

## తుమ్మిడిహెట్టి పునఃపరిశీలనకు
# అభ్యంతరం లేదు..

### కమిటీ వేయండి : దేవేంద్ర ఫడణవీస్

### ఎత్తు పెంపునకు సీఎం రేవంత్ విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి సానుకూల స్పందన

### 152 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలన్న రేవంత్‌రెడ్డి

### మహారాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం

### ముంబైలో ఫడ్నవీస్‌తో సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం భేటీ..

మహారాష్ట్రపై ప్రతికూల ప్రభావం లేకపోతే తుమ్మిడిహెట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి గతంలో కుదిరిన ఒప్పందాన్ని పునఃపరిశీలించేందుకు తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ నీటి అవసరాలకు సహకరిస్తామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. కేంద్ర జలసంఘం అధ్యయనంతో పాటు రెండు రాష్ట్రాల అధికారులతో కూడిన కమిటీ అన్ని అంశాలను పరిశీలించాలని ప్రతిపాదించారు. ముంపు, ప్రభావిత ప్రాంతానికి సంబంధించి ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని సూచించారు. తెలంగాణ నీటి అవసరాలు, వెనుకబడిన ప్రాంత అభివృద్ధి, గిరిజనుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తుతో ఆనకట్ట నిర్మాణానికి సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రను కోరారు.



**హైదరాబాద్, అక్టోబర్ 26 :** తెలంగాణ, మహారాష్ట్రల పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రెండు రాష్ట్రాల సరిహద్దులో ప్రాణహిత నదిపై 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి సహకరించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన విజ్ఞప్తిపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ ఎత్తును పెంచాలన్న తెలంగాణ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనా పరమైన అంశాలను పరిశీలించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రపై, తమ ప్రజలపై ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే, 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణానికి గతంలో రెండు రాష్ట్రాల మధ్య జరిగిన ఒప్పందాన్ని పున: పరిశీలించడానికి అభ్యంతరం లేదని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ బృందం సోమవారం ముంబైలోని సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఫడ్నవీస్‌తో సమావేశమై

-మిగతా 2 లో..



## ఉత్తమ్‌కు హరీశ్‌రావు
# సవాల్

### తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీ ద్వారా నీళ్లా?

### అలా తెస్తామని నిరూపిస్తే రాజీనామా చేస్తా... లేదంటే మీరు చేస్తారా?

తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్‌రావు సవాల్ విసిరారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తెస్తామంటున్నారనీ, అదే నిరూపిస్తే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని అన్నారు. ఎల్లంపల్లికి గ్రావిటీతో నీళ్లు తేవడం కుదరదని తేలితే ఉత్తమ్ రాజీనామా చేస్తారా? అని సవాల్ విసిరారు.

**హైదరాబాద్, అక్టోబర్ 26 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బృందం.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కలిసిన నేపథ్యంలో.. హరీశ్‌రావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు డీపీఆర్‌ను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. "తెలంగాణ కంటే ఏపీలో వర్షపాత లోటు ఎక్కువ. అలాంటిది.. ఇక్కడ

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 142 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 169 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 262 (కిలో) |
| స్కిన్ లెస్ | 296 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹82



02

## నేడు తెలంగాణలో 4 ఉమ్మడి జిల్లాల్లో వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 26 : బంగాళాఖాతంలో ఏర్పడిన అర్నబ్ తుపాను రాష్ట్రంపై మంగళవారం నుంచి ప్రభావం చూపే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. బుధవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. జయశంకర్ భూపాలపల్లి, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు

-మిగతా 2 లో..

## పంట ఎండితే ప్రభుత్వానికి
# సంబంధం లేదు!

**వరి సాగు చేస్తే పూర్తి బాధ్యత మీదే**

**విత్తనాలు కొనాలంటే సెల్ఫ్ డిక్లరేషన్ తప్పనిసరి**

### రైతుల నుంచి ఆ మేరకు హామీ పత్రం తీసుకోవాలి

### విత్తనాల డీలర్లకు వ్యవసాయ శాఖ ఆదేశాలు

### యాసంగిలో వరి వద్దంటూ సూచనలు..

### ఆరుతడి పంటల విత్తనాలూ అందించలేని పరిస్థితి

**హైదరాబాద్, అక్టోబర్ 26 :** యాసంగిలో వరి సాగు వద్దని ఇన్నాళ్లూ సూచనలకే పరిమితమైన ప్రభుత్వం ఇప్పుడు మరో అడుగు ముందుకేసింది. వరి వంగడాల కోసం వచ్చే ప్రతి రైతు నుంచి 'స్వయం అంగీకార పత్రం' (సెల్ఫ్ డిక్లరేషన్) తీసుకున్న తర్వాతే విత్తనాలు అమ్మాలని డీలర్లకు వ్యవసాయ శాఖ ఆదేశాలు జారీ చేసింది. 'ప్రభుత్వం వరి వేయవద్దని చెబుతున్నా,

-మిగతా 2 లో..



# తుమ్మిడిహెట్టి పునఃపరిశీలనకు అభ్యంతరం లేదు..



## ఉత్తమ్‌కు హరీశ్‌రావు సవాల్

(మొదటిపేజీ తరువాయి)

క్రాప్ హాలీడే ఎందుకు ఉంది? ఏపీలో ఎందుకు లేదు? దేవాదుల వద్ద పంపులు నడిపి ఉంటే వరంగల్ జిల్లాకు కరవు ఉండేది కాదు. శ్రీశైలంలో నీళ్లు ఉన్నా ఎందుకు ఎత్తిపోయలేదు. కల్వకుర్తిలో ఐదు మో టార్లున్నా రెండు మోటార్లే నడుపుతు న్నారు. అది కూడా రెండు గంటలే నడుపుతున్నారు. శ్రీశైలం నుంచి ఏపీ తీసుకెళ్తున్నదెంత? తెలంగాణ తీసుకొ స్తున్నదెంత? దేవాదుల, కల్వకుర్తి పంపుల వాడకంపై శ్వేతపత్రం విడుదల చేయాలి. కన్నెపల్లి వద్ద నీళ్లను అవకాశం ఉన్నా ఎందుకు ఎత్తిపోయలేదు. ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరవే. ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి మహారాష్ట్రకు వెళ్లారు. మేం 2014లో ప్రభుత్వంలోకి వచ్చిన 42 రోజుల్లోనే ఆ రాష్ట్రంతో చర్చలు జరిపాం. కానీ, రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెయ్యి రోజుల తర్వాత చర్చలు జరిపారు. మూడేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు మహారాష్ట్ర వెళ్లారు" అని హరీశ్‌రావు అన్నారు. 2013 జనవరి 21న జరిగిన కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ మినిట్స్‌లో.. "బ్యారేజీ ఎత్తు తగ్గించడానికి ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకొన్నది' అని స్పష్టంగా ఉంది. అయినా చిత్తశుద్ధితో మా వంతు ప్రయత్నం మేం చేశాం. ఇప్పుడు మీరు 152 మీటర్ల కోసం ప్రయత్నం చేయడానికి మాకు అభ్యంతరం లేదు. అది అవుతుందో.. లేదో కాలమే చెబుతుంది. అసలు తుమ్మిడిహెట్టి దగ్గర మనకు కావాల్సినన్ని నీళ్లు లేవని, ప్రత్యామ్నాయం చూసుకోవాలని సీడబ్ల్యూసీ మూడుసార్లు అధికారికంగా లేఖలు రాసింది. 160 టీఎంసీలు కాదు కదా.. 102 టీఎంసీలు కూడా అందుబాటులో లేవని స్పష్టంచేసింది. హైదరాబాద్ సహా ఇతర జిల్లాల మంచినీళ్లకే 50 టీఎంసీలు కావాలి. మరి సాగునీటి పరిస్థితి ఏమిటి, కాళేశ్వరం పథకంలోలాగా 240 టీఎంసీలు వస్తాయా... తుమ్మిడిహెట్టి డీపీఆర్ బయటపెట్టండి. రాజకీయాలను పక్కనబెట్టి ముందుగా మేడిగడ్డను మరమ్మతు చేయండి. కన్నెపల్లి వద్ద తక్షణమే మోటార్లు ఆన్ చేయండి" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## రాజీనామా చేసి..
## వేరే పార్టీలోకి వెళ్లొచ్చు

(మొదటిపేజీ తరువాయి)

అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ పార్టీ నేతలు ఇటీవల మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో, ఎన్నికల సంఘం, తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారికి ఒక ఆదేశం జారీ చేయాలని కోరారు. దీని ప్రకారం, స్వచ్ఛందంగా రాజీనామా చేసిన ఎమ్మెల్యే, ఆ రాజీనామా వల్ల ఏర్పడే ఉప ఎన్నికలో తిరిగి పోటీ చేయాలనుకుంటే.. దాని నిర్వహణకు అయ్యే ప్రభుత్వ వ్యయంతో సమానమైన మొత్తాన్ని ముందుగా డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఎమ్మెల్యేల రాజీనామాలను ఆమోదించిన తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ..పిటిషనర్ సుప్రీంను ఆశ్రయించారు.

## నేడు తెలంగాణలో 4 ఉమ్మడి జిల్లాల్లో వర్షాలు

(మొదటిపేజీ తరువాయి)

కురుస్తాయని పేర్కొంది. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. గురువారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కొన్నిచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం 28వ తేదీ ఉదయం ఆంధ్రప్రదేశ్-యానాం ప్రాంతాల్లో తీరం దాటే అవకాశాలు ఉన్నాయని, అనంతరం ఉత్తర దిశగా ప్రయాణిస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

## చలికి గజగజ

**రాత్రివేళ పడిపోతున్న ఉష్ణోగ్రతలు**

**రానున్న రోజుల్లో పెరగనున్న చలి**



**హైదరాబాద్:** హైదరాబాద్‌లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 4-5 డిగ్రీల మేర పడిపోయాయి. ఆకాశంలో మబ్బులు లేకపోవడంతో చలిగాలుల ప్రబావం ఎక్కువ గా ఉంటోందని.. రానున్న రోజుల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ అధికారులు చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కన్నా తక్కువగా నమోదయ్యాయి. అయితే పగటిపూట మాత్రం చాలా ఎండలు తగ్గలేదు. రాత్రిపూట తట్టుకోలేనంత చలి ఉన్నా పగలు బాగా ఎండ కోడుతోంది. రంగారెడ్డిజిల్లా బాలాపూర్, సరూర్‌నగర్ మేడ్చల్ జిల్లా కీసర, వికారాబాద్ జిల్లా పెద్దేముల్‌లో 35 డిగ్రీలకుపైగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

(మొదటిపేజీ తరువాయి)

తుమ్మిడిహెట్టి బరాజ్‌పై చర్చలు జరిపింది. తొలుత బరాజ్ ప్రాధాన్యతపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని వివరించారు. బరాజ్ ఎత్తు పెంపు ప్రతిపాదనలు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ విషయంలో గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరి అనుసరించిందని ఫడ్నవీస్ గుర్తుచేశారు. బరాజ్ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణాన్ని తమ స్వతంత్ర అధ్యయనంలో పరిశీలిస్తామని, ఈ అధ్యయనంలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు వాటిపై చర్చిస్తారని ఫడ్నవీస్ తెలిపారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామన్నారు. గతంలో ఇచ్చిన అనుమతుల అనంతరం ప్రాజెక్టు వల్ల ఏర్పడే వాస్తవ ముంపు ప్రాంతం తొలుత అంచనా వేసిన దానికంటే పెరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఈ నేపథ్యంలో వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలంగాణ నీటి అవసరాల విషయంలో సహకరించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే మహారాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకే ప్రాధాన్యం అని ఫడ్నవీస్ తెలిపారు. తుమ్మిడిహెట్టి విషయంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) కూడా అవసరమైన అధ్యయనాలు, సాంకేతిక పరిశీలనలు చేపడుతుందని చెప్పారు. ఆలోగా రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. బరాజ్ ఎత్తు, నీటి లభ్యతపై ఈ కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. ప్రాజెక్టు స్థలంలో మార్పులతో ముంపు ప్రాంతంపై పడే ప్రభావం, సంబంధిత అభయారణ్యం పరిధిలోకి వచ్చే ప్రాంతాలు, నదీ పరివాహక ప్రాంతం వెలుపల అవసరమయ్యే భూముల వివరాలను పరిశీలిస్తామని వెల్లడించారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలనూ అధ్యయనం చేయాలని చెప్పారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలని, రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు.



### రెండు రాష్ట్రాలను కలిపే వారధి: సీఎం రేవంత్

దేశ రక్షణ, వ్యూహాత్మక రంగాల విషయంలో ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను సీఎం రేవంత్ ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. తుమ్మిడిహెట్టి కేవలం సాగునీటి ప్రాజెక్టుగానే కాకుండా, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా నిలుస్తుందని చెప్పారు. తెలంగాణ--మహారాష్ట్ర మధ్య చారిత్రక, సాంస్కృతిక సంబంధాలున్నాయంటూ పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని చెబుతూ అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ఫడ్నవీస్ దృష్టికి తీసుకెళ్లారు. వారి జీవితాల్లో వెలుగులు నింపాల్సిన అవసరం ఉందన్నారు. ఇలావుండగా..హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు మహారాష్ట్ర సీఎంను ముఖ్యమంత్రి ఆహ్వానించారు. ఈ సదస్సుకు హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని చెప్పారు.

### 152 మీటర్ల ఎత్తుతోనే అత్యంత ప్రయోజనం: మంత్రి ఉత్తమ్

తుమ్మిడిహెట్టి బరాజ్‌ను 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని మంత్రి ఉత్తమ్ తన ప్రజెంటేషన్‌లో వివరించారు. 2016లో 148 మీటర్ల ఎత్తుతో బరాజ్ నిర్మాణానికి ఒప్పందం జరిగినా, దానితో తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని చెప్పారు. బరాజ్‌తో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

## పంట ఎండితే ప్రభుత్వానికి సంబంధం లేదు!

(మొదటిపేజీ తరువాయి)

నా పొలంలో వరి మాత్రమే పండుతుంది కాబట్టి నా సొంత నిర్ణయంతో వరి వేస్తున్నా. కరెంటు గానీ, నీరు గానీ అందక పంట పండకపోతే డీలర్లకు గానీ, ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధం లేదు..'అని రైతు రాసిచ్చి, సంతకం లేదా వేలిముద్ర వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టుల కింద సాగునీటి వసతి ఉన్న పొలాల్లోనే కాదు, సొంత బోర్లు, బావుల కింద కూడా ఈ యాసంగిలో వరి వేయవద్దని వ్యవసాయ శాఖ స్పష్టం చేస్తోంది. అయినా మొండిగా వరి సాగు చేస్తే నష్టానికి రైతే బాధ్యుడని ఈ పత్రం ద్వారా ముందుగానే రాయించుకుంటోంది. వరి విత్తనాలు కొనాలంటే రైతు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిందేనని నిబంధన పెట్టిన వ్యవసాయ శాఖ.. ఆరుతడి విత్తనాలకు కూడా జనవరి వరకు వేచి ఉండాలని చెబుతోందని రైతులు వాపోతున్నారు. ప్రాజెక్టులు, చెరువుల కింద నీరు ఇచ్చే పరిస్థితి లేదని, ఉన్న కొద్దిపాటి నీరు తాగడానికే సరిపోతుందని ప్రభుత్వం చెపుతోంది. జలాశయాల్లో సాధారణంగా ఈ సమయంలో 462 టీఎంసీలు ఉండాల్సి ఉండగా 200 టీఎంసీలే ఉన్నాయి. మొత్తం తాగునీటికే కేటాయించారు. అదే సమయంలో కరువు విశ్వరూపం దాల్చే అవకాశం ఉన్న నేపథ్యంలో బోర్లు, బావుల కింద కూడా వరి వేయవద్దని స్పష్టం చేస్తోంది. సెప్టెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 11.24 మీటర్ల లోతుకు పడిపోయింది. గతేడాదితో పోలిస్తే ఇది 6.44 మీటర్లు దిగువ. ఇక అక్టోబర్‌లో సాధారణంగా 15 వేల మెగావాట్లు ఉండే విద్యుత్ డిమాండ్ ఈసారి 20 వేల మెగావాట్లు దాటింది. భూగర్భ జలాలు అందడం మాట అలా ఉంచితే యాసంగిలో బోర్లన్నీ ఒకేసారి నడిస్తే కరెంటు సరఫరా కష్టమన్నది అధికారుల ఆందోళన. గత యాసంగిలో రాష్ట్రంలో 92.17 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాగా, అందులో 65.42 లక్షల ఎకరాల్లో వరే వేశారు. ఈసారి ఆ విస్తీర్ణాన్ని 20 నుంచి 30 లక్షల ఎకరాలకు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తోంది. వరి వద్దన్నప్పుడు ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు సిద్ధంగా ఉంచాల్సిన ప్రభుత్వం ఆ పని చేయడంలో విఫలమైందని రైతులు విమర్శిస్తున్నారు. రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు వంటి చిరుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటల విత్తనాల కోసం జనవరి వరకు ఆగాలని వ్యవసాయ శాఖ సిబ్బంది చెపుతున్నారని రైతులు వాపోతున్నారు. యాసంగి విత్తనాలు నవంబర్, డిసెంబర్‌లో పడాల్సి ఉండగా, జనవరిలో విత్తితే పంట చివరి దశ మార్చి, ఏప్రిల్ ఎండల బారిన పడుతుంది. ఆ సమయానికి బోర్లు మరింత అడుగంటి దిగుబడి దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. విత్తన రాయితీకి రూ.224 కోట్లు ప్రతిపాదించామని వ్యవసాయ శాఖ చెబుతున్నా, అవి ఇంకా ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. ప్రభుత్వం ఇవ్వలేకపోతే ప్రైవేటు దుకాణాల్లో ఎక్కువ ధరకు, నాణ్యత తెలియని విత్తనాలు కొనాల్సి వస్తుందని, నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదమూ ఉందని ఆందోళన చెందుతున్నారు. చిరుధాన్యాలు తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో పండుతాయని, వాటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని ప్రభుత్వమే ప్రచారం చేస్తోంది. కానీ వాటి విత్తనాలను గ్రామ స్థాయిలో రైతుకు అందించే ఏర్పాట్లు మాత్రం కనిపించడం లేదు. కరువు నేపథ్యంలో అవసరమైన విత్తనాలు రైతులకు ఇస్తేనే పంట మార్పిడికి ముందుకొస్తారని రైతు సంఘాల నాయకులు అంటున్నారు.

## మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

(మొదటిపేజీ తరువాయి)

అని సవాల్ విసిరారు. గోదావరి ఉమ్మడి నది అని, జీఆర్ఎంబీ ఇచ్చే అవార్డును రెండు తెలుగు రాష్ట్రాలు గౌరవించాల్సిందేనని ఆయన అన్నారు. నవంబరు 2న 'లోక్‌తంత్ర బచావో-అరాచకత హఠావో' పేరిట హైదరాబాద్‌లో భాజపా చేపడుతున్న భారీ పాదయాత్రకు ముఖ్య అతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నట్లు రామచందర్‌రావు వెల్లడించారు. భాజపాపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలు గట్టిగా తిప్పికొట్టడమే ఈ పాదయాత్ర లక్ష్యమన్నారు. ఈ మేరకు ఈ పాదయాత్రకు అనుమతి కోరుతూ రామచందర్‌రావు నేతృత్వంలో ఆ పార్టీ బృందం సోమవారం డీజీపీ సీవీ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందచేసింది. పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భాజపా కోరింది.



## వడ్లు పైపైకి.. బియ్యం భగ్గు!

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాల్లోనూ సన్న ధాన్యానికి మంచి ధరలు లభిస్తుండటంతో రైతులు బహిరంగ మార్కెట్ వైపు మొగ్గు చూపుతున్నారు.

### మద్దతు ధర కంటే ఎక్కువ.. కొనుగోలు కేంద్రాలకు సవాల్!

ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరతో పోలిస్తే బహిరంగ మార్కెట్‌లో అధిక ధర లభిస్తుండటం ధాన్యం సేకరణపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 కనీస మద్దతు ధర ఉండగా, ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు సన్న రకాల ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందిస్తోంది. దీంతో అర్హమైన సన్న రకాల ధాన్యానికి మద్దతు ధర, బోనస్ కలిపి రూ.2,961 వరకు లభించే అవకాశం ఉంది. అయితే ప్రైవేట్ మార్కెట్‌లోనే రూ.3,500 నుంచి అంతకంటే ఎక్కువ ధర లభిస్తుండటంతో రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చేందుకు ఆసక్తి చూపుతారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### ప్రభుత్వానికి ద్వంద్వ సవాల్!

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రజలకు సన్న బియ్యం సరఫరా చేయాలంటే ప్రభుత్వం తగినంత ధాన్యాన్ని సేకరించాల్సి ఉంటుంది. బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరిగితే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక తగ్గే అవకాశం ఉంది. దీంతో ఒకవైపు రైతులకు మెరుగైన ధర లభించేలా చూడటం, మరోవైపు ప్రభుత్వ సేకరణ లక్ష్యాలను చేరుకోవడం, వినియోగదారులకు అందుబాటు ధరల్లో బియ్యం సరఫరా చేయడం ప్రభుత్వానికి కీలకంగా మారింది.

### ధరలు ఇలాగే ఉంటాయా?

అయితే ప్రస్తుత ధరలు ఇలాగే కొనసాగుతాయా? నవంబర్, డిసెంబర్ నెలల్లో పంట కోతలు పూర్తిస్థాయికి చేరి మార్కెట్‌కు మరింత ధాన్యం వచ్చిన తర్వాత ధరలు తగ్గుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు వినియోగదారులపై ధరల భారం తగ్గించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందన్నది ఇప్పుడు కీలకం.

## 34 మిల్లులకు సీఎంఆర్ కేటాయింపులుండవు

### అరెస్టైన 14 మంది మిల్లర్ల రిమాండ్

**హైదరాబాద్:** ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన వరి పంట కొందరు మిల్లర్లకు కాసులు కురిపించింది. ధాన్యాన్ని బియ్యంగా మార్చే క్రమంలో తరుగు వస్తోందని, విరిగిపోతున్నాయని, రంగు మారుతోందని అధికారులను మచ్చిక చేసుకుని వారిచ్చిన వెసులుబాటును తమకు అనుకూలంగా మార్చుకుని కోట్లు కొల్లగొట్టారు. దీనిపై సీఐడీ విచారించింది. ములుగు, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో సన్నబియ్యం స్థానంలో దొడ్డుబియ్యాన్ని ఎఫ్‌సీఐకి సరఫరా చేసిన 14 మందిని ఇప్పటికే అరెస్టు చేయగా సోమవారం వారిని రిమాండ్‌కు తరలించారు. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) విషయంలో భారీగా అక్రమాలకు పాల్పడిన 34 రైస్ మిల్లులకు సంబంధించిన యజమానుల పేర్లను ఆన్‌లైన్ నుంచి తొలగించినట్లు సమాచారం. వారికి భవిష్యత్తులో సీఎంఆర్ కేటాయించకుండా చర్యలు తీసుకోనున్నారని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం 2025 ఖరీఫ్ సీజన్‌లో 71.86 లక్షల టన్నుల సన్న, దొడ్డు ధాన్యాన్ని సేకరించి మిల్లర్లకు అప్పగించింది. ధాన్యంలో తరుగు, విరిగిపోవడం, సమస్య ఉందని.. గ్రేడ్ ఏగా పాస్ కావడం లేదని, కామన్‌గా అనుమతించాలని అధికారులను మిల్లర్లు కోరారు. అందుకు అదనంగా తాము క్వింటాకు రవాణా, హమాలీ ఛార్జీలతో కలిపి రూ.34.21 చెల్లిస్తామని చెప్పారు. ఇందుకు కొన్ని జిల్లాల పౌరసరఫరాల శాఖ డీఎంలు, డీసీఎస్‌వోలు, డీటీలు మిల్లర్లతో కుమ్మక్కై అనుమతులు ఇచ్చారు. ఈ లొసుగును తమకు అనుకూలంగా మార్చుకొని పౌరసరఫరాల శాఖ ఇచ్చిన సన్న ధాన్యం రకాలు కాకుండా, దొడ్డు రకాలను ఎఫ్‌సీఐకి అంటగట్టారు. అయితే కొన్ని జిల్లాల్లో ఈ విధానాన్ని అధికారులు తిరస్కరించారు. ములుగు జిల్లాలో ఇది వెలుగు చూడగా అక్టోబరు 24న సీఐడీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో సీఐడీ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ఏ గ్రేడ్ రకం నుంచి కామన్‌గా మార్చుకున్న రైస్‌మిల్లుల వివరాలు, వారు ఎఫ్‌సీఐకి ఇచ్చిన బియ్యం నమూనాలను సేకరించారు. ల్యాబ్ పరీక్షల అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ బృందాలు అన్ని జిల్లాలోని మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాయి. ఆగస్టు 24న ములుగు కలెక్టర్ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ఏ గ్రేడ్ ధాన్యాన్ని కామన్‌గా మార్చడానికి 25 మంది మిల్లర్లకు అనుమతులు జారీ చేశారని సీఐడీ అధికారులు కోర్టుకు అందించిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. మిల్లర్లు తాము తీసుకున్న సన్నవడ్లను బహిరంగ మార్కెట్‌లో 3,200 విక్రయించారు. వీటికి బదులుగా ఇతర రాష్ట్రాల్లో దొడ్డు బియ్యాన్ని 2,100కు కొనుగోలు చేసి.. 1.67 లక్షల టన్నుల బియ్యం ఎఫ్‌సీఐకి అప్పగించారు. ఇలా మిల్లర్లకు భారీగా లాభం చేకూరింది. బోనస్ రూపంలో ప్రభుత్వానికి రూ.83 కోట్ల నష్టం వాటిల్లడంతోపాటు మిల్లర్లకు రూ.161 కోట్ల లబ్ధి చేకూరింది.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**కరీంనగర్ (ఇదే నిజం) అక్టోబర్ 26 :** తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కరీంనగర్ జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు వినూత్న నిరసన చేపట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు పోస్టుకార్డుల ద్వారా విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సర్వీసు సంబంధిత సమస్యల పరిష్కారం కోసం గత కొంతకాలంగా ఆందోళనలు కొనసాగిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ క్రమంలో తమ గోడును ప్రభుత్వానికి తెలియజేసేందుకు పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య సేవలకు అంతరాయం కలగకుండా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.




## పోలీస్ కమిషనరేట్‌లో వాల్మీకి జయంతి

**కరీంనగర్( ఇదే నిజం) అక్టోబర్.26 :** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి అందించిన సత్యం, ధర్మం, నైతిక విలువలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మహర్షి బోధనలు మానవాళికి సన్మార్గాన్ని చూపుతాయని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. వాల్మీకి మహర్షి రచనలు, బోధనలు సమాజంలో నైతిక విలువలను పెంపొందించడంతో పాటు ప్రజలు ధర్మబద్ధమైన జీవనాన్ని సాగించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. మహర్షి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సత్యం, ధర్మం, న్యాయం పట్ల నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలను, సమాజానికి అందించిన సందేశాలను స్మరించుకోవడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొని వాల్మీకి మహర్షికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.



## వెంకటాపూర్‌లో ఘనంగా వాల్మీకి జయంతి

**రామాయంపేట, అక్టోబర్ 26(ఇదే నిజం):** మెదక్ జిల్లా రామాయంపేట మండలం ఆర్ వెంకటాపూర్ గ్రామంలో వాల్మీకి జయంతి వేడుకలను వాల్మీకి బోయ సంఘం మండల అధ్యక్షుడు కే గట్టయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహర్షి వాల్మీకి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి వాల్మీకి మహర్షి ఆశీస్సులు అందరికీ ఉండాలని ప్రార్థించారు. అనంతరం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామస్తులు వాల్మీకి బోయ సంఘం సభ్యులు పాల్గొని వాల్మీకి జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకుగారి ఉమారాణి సంజీవరెడ్డి, వార్డు సభ్యులు రాచపల్లి ఎల్లం, కీసరి నాగరాణి రాజా గౌడ్, అనురాధ నరేష్, వాల్మీకి బోయ సంఘం సభ్యులు సుతారి శ్రీనివాస్, స్వామి నరసింహులు రవి పెంటయ్య అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం

### విద్యార్థులకు పోలీస్ స్టేషన్ విధులపై అవగాహన కల్పించిన పోలీసులు



**పెద్దపల్లి, ఇదే నిజం,అక్టోబర్ 26:** పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పెద్దపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ గుమ్ముల రాజశేఖర్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొని విద్యార్థులకు పోలీస్ స్టేషన్‌లో నిర్వహించే వివిధ విధులు, కార్యకలా పాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల ఫిర్యాదులను స్వీకరించడం, వారి సమస్యల పరిష్కారానికి పోలీసు లు తీసుకునే చర్యలు, ప్రజలకు అందించే సేవల గురించి విద్యార్థులకు వివరించారు. సమాజంలో శాంతిభద్ర తల పరిరక్షణలో పోలీసులు పోషించే కీలక పాత్రను తెలియజేశారు. ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పోలీస్ శాఖ పనితీరుపై అవగాహన పెరిగింది.

# ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై బిఆర్ఎస్ సమీక్ష

### మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్
### పట్టణ పార్టీ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు



**చేర్యాల, ఇదే నిజం:** చేర్యాల పట్టణ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు సమీక్ష కార్యక్రమానికి పట్టణ పార్టీ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు అధ్యక్షత జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చినప్పటినుండి అబద్దాలతో ప్రజలను మోసం చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలాంటి అభివృద్ధి లేకుండా పాలన సాగిస్తుందని అన్నారు రైతులను నిరుద్యోగులను వికలాంగులకు ఇచ్చిన హామీలను బిఆర్ఎస్ పార్టీ ప్రశ్నించినందుకు మాజీ సీఎం కెసిఆర్ ప్రభుత్వం పై బుడద చల్లుతూ బదునం చేసే కార్యక్రమం తప్ప రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదు నిరుద్యోగులు, రైతులు, వికలాంగులు, వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినప్పుడు డైవర్షన్ రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అరుణ బాల నరసయ్య, వైస్ చైర్ పర్సన్ మేడిశెట్టిఉమా శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు అనంతుల మల్లేశం, కౌన్సిలర్స్ నిమ్మ సుప్రజ రాజీవ్ రెడ్డి, బబుల్ ఎండి ఇంచార్జ్, నాయకులు అంకుగారి శ్రీధర్ రెడ్డి, కోఆర్డినేటర్ కొమ్ము రాజు, యాట యాదగిరి, బి రెడ్డి ఇన్నారెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నర్రా ఉపేందర్ రెడ్డి, మంగోల్ చంటి, జింకల పర్వతాలు, శివ గారు అంజయ్య, పిడతల ఎల్లారెడ్డి, కోతి దాసు, రాళ్ళబండి పరిపూర్ణం, అరిగే కనకయ్య, సిద్ధి లింగం గుప్తా, బంగారు గళ్ళ కిరణ్, తోడేంగల రాజేష్, తదితరులు పాల్గొన్నారు

## చేర్యాలని కరువు మండలంగా ప్రకటించాలి

### ఎండిపోతున్న పంటలను పరిశీలించి రైతాంగాన్ని ఆదుకోవాలి




**ఇదే నిజం, చేర్యాల:** ఎల్‌నినో ప్రభావం వల్ల సరైన వర్షాలు లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునే పరిస్థితి లేనందున చేర్యాల మండలాన్ని వెంటనే కరువు మండలం గా ప్రకటించాలని అనావృష్టితో కొట్టుమిట్టాడుతూ మండల వ్యాప్తంగా పంటలను సంబంధిత అధికారులు పరిశీలించి రైతాంగాన్ని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం చేర్యాల మండల అధ్యక్ష, కార్యదర్శులు బోడిగం నర్సిరెడ్డి, నాగపురి కనకయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రోజున చేర్యాల రైతు వేదికలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి అధికారులకు రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మెమోరాండం అందించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నాగపురి కనకయ్య మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల ఈ సంవత్సరం కొద్దిపాటి వర్షాలకు రైతులు పంటలను విత్తుకోవడం పంటలు పూత, కాతా దశకు వచ్చేవరకు సాధారణ వర్షపాతం కంటే అతి తక్కువ వర్షపాతం నమోద యి నందున ప్రస్తుతము నెల రోజుల నుండి వర్షాలు రాకపోవడం వల్ల చుక్కనీరు లేక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయని వరి ,పత్తి, మొక్కజొన్న ప్రధాన పంటల దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయని, పంటల సాగుకు రైతులు పెట్టుబడి పెట్టి అప్పుల పాలయ్యారని ఈ రైతాంగాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని వర్షాభావానికి తోడు కరెంటు కోతలు పెరిగిపోయి నాణ్యమైన విద్యుత్తు రైతులకు అందడం లేదని దీనివల్ల మోటార్లు కాలిపోతూ నష్టపోతున్నారని ఎల్ నీనో ప్రభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయాయని రాబోయే రోజుల్లో త్రాగునీటికి కూడా ఇబ్బందులు కలిగే పరిస్థితిలో మండలంలో ఉన్నాయని వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అధికారులు వాస్తవ పరిస్థితిని ప్రభుత్వానికి తెలియజేసి చేర్యాల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం టౌన్ కార్యదర్శి తుప్పతిరాజు, రైతు సంఘం మండల నాయకులు నంగి మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగ్గారెడ్డి!

### గురునానక్ మందిర్ కమాన్ల నిర్మాణానికి భూమిపూజ..

### మందిర్‌లో ప్రత్యేక ప్రార్థనలు.. సమస్యల పరిష్కారానికి భరోసా..

**సంగారెడ్డి,ఇదేనిజం(అక్టోబర్26) :** గత ఏడాది గురునానక్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు సంగారెడ్డి పట్టణంలోని బ్రాహ్మణవాడలో గురునానక్ మందిర్‌కు రెండు కమాన్ల నిర్మాణ పనులకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. గురునానక్ మందిర్‌కు వెళ్లే ప్రవేశ మార్గంలో ఒక కమాన్, మందిర్ సమీపంలోని భవాని మందిర్ రోడ్డులో మరో కమాన్ నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. అంతకు ముందు గురునానక్ మందిర్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర్ ప్రతినిధులు తమ సమస్యలను జగ్గారెడ్డి దృష్టికి తీసుకురాగా, వాటిని త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మందిర్ ప్రాంగణంలోని రావిచెట్టు కింద ఉన్న నాగదేవత ఆలయాన్ని అభివృద్ధి చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్‌కు సూచించారు. ప్రస్తుతం ఉన్న విగ్రహాలను యథాస్థానంలోనే ఉంచి అభివృద్ధి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిక్కు ప్రముఖులు డాక్టర్ సర్దార్ సురేందర్ గోపి సింగ్, సర్దార్ తేజేందర్ సింగ్, సర్దార్ స్వరణ్ సింగ్, సర్దార్ సత్‌పాల్ సింగ్, డాక్టర్ సర్దార్ భరత్ సింగ్, సిక్కు గురువు గురుదేవ్ సింగ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, నరేన్, సుధాకర్ పాల్గొన్నారు.





## యాదవ ఒగ్గు పూజారుల సమస్యలు పరిష్కరించాలి



**కరీంనగర్( ఇదే నిజం) అక్టోబర్.26 :** యాదవ ఒగ్గు పూజారుల సమస్యలను పరిష్కరించి, వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో యాదవ ఒగ్గు పూజారుల భేరి ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ చౌక్ నుంచి కశ్మీర్‌గడ్డ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఒగ్గు పూజారులు, యాదవ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఒగ్గు పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్న పూజలు, ఆచారాలు, జానపద కళలను గుర్తించి వారికి తగిన ప్రోత్సాహం అందించాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఆర్థిక ఇబ్బందులతో జీవనం సాగిస్తున్న ఒగ్గు పూజారుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఒగ్గు పూజారులకు నెలకు రూ. 5 వేల పెన్షన్ అందించాలని, వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వారి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు భవనాల నిర్మాణం కోసం స్థలాలు కేటాయించాలని కోరారు. ఒగ్గు పూజారుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు సబ్సిడీపై ఆటోలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## స్కూల్ ఫీజుల ప్రొసీడింగ్‌పై కలెక్టర్‌ను ప్రశ్నించిన వెన్నంపల్లి శ్రీనివాస్

### ఎమ్మెల్యే విజయరమణారావు జోక్యం..

### ప్రొసీడింగ్ జారీ చేయాలని అధికారులకు ఆదేశం

**పెద్దపల్లి, ఇదే నిజం, అక్టోబర్ 26 :** స్కూల్ ఫీజుల ప్రొసీడింగ్ జారీ అంశంపై జర్నలిస్టు సంక్షేమ సంఘం (జేఎస్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ అధికారులను ప్రశ్నించారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ-రమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమక్షంలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. స్కూల్ ఫీజుల ప్రొసీడింగ్ జారీ విషయంలో స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే విజయరమణారావు, సంబంధిత అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. స్కూల్ ఫీజుల ప్రొసీడింగ్ జారీ చేయాలని ఆదేశించినట్లు సమాచారం. స్కూల్ ఫీజుల ప్రొసీడింగ్ అంశాన్ని ప్రజాప్రతినిధి, జిల్లా కలెక్టర్ సమక్షంలో జర్నలిస్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెన్నంపల్లి శ్రీనివాస్ నేరుగా ప్రస్తావించడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే విజయరమణారావు స్పందించి ప్రొసీడింగ్ జారీ చేయాలని అధికారులను ఆదేశించడంతో ఈ అంశంపై తదుపరి చర్యలపై ఆసక్తి నెలకొంది.



## చేర్యాల పట్టణ కాంగ్రెస్ వార్డు కమిటీల ఎన్నిక

**ఇదే నిజం, చేర్యాల:** జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి పిలుపు మేరకు కొత్త వార్డు కమిటీల ఎన్నిక ప్రక్రియలో భాగంగా ఈరోజు చేర్యాల పట్టణంలో రెండవ మూడవ వార్డుల కమిటీని పట్టణాధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. రెండవ వార్డు కమిటీ అధ్యక్షునిగా గూడ నాగశేఖర్ రెడ్డి మూడవ వార్డు అధ్యక్షునిగా ఎర్రమైసగల్ల గణేష్ లను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు పుర్మ ఆగం రెడ్డి స్పోక్స్ పర్సన్ కాటం సంజీవయ్య మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగారావు దాసరి కళావతి కొమురవెల్లి దేవస్థానం మాజీ చైర్మెన్ ముస్త్యాల కిష్టయ్య కాటం తేజా సంజీవయ్య కౌన్సిలర్ ఎండీ ఖాజా మార్కెట్ డైరెక్టర్ పచ్చిమడ్ల వెంకటయ్య మాజీ కౌన్సిలర్లు చెవిటి లింగం పచ్చిమడ్ల సతీష్ నాయకులు గుస్క శ్రీనివాస్ మిట్టపల్లి నర్సిరెడ్డి బుట్టి యాదగిరి చెన్నిగారి బిక్షపతి పచ్చిమడ్ల సత్యనారాయణ అల్లం శ్రీనివాస్ కాటం శ్రీనివాస్ అంబాల రాము మల్లిగారి నర్సింలు పోలోజు ఆంజనేయులు ఎండీ జహిరోద్దీన్ తుమ్మలపల్లి సంతోష్ బుడిగె సతీష్ శ్రీరామ్ వెంకటేష్ ఖాత శ్రీనివాస్ కోరె శ్రీశైలం గుడాల శ్రీనివాస్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి టౌన్ ఎస్సై రాజశేఖర్‌కు ఘన సన్మానం

**పెద్దపల్లి, ఇదే నిజం,అక్టోబర్ 26:** పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గుమ్ముల రాజశేఖర్‌ను జర్నలిస్టు సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వెన్నంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజశేఖర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు,ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. పోలీసులకు,జర్నలిస్టులకు మధ్య పరస్పర సహకారం, సమన్వయం ఉండటం సమాజానికి ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. రాజశేఖర్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జెఎస్ఎస్ గౌరవ అధ్యక్షులు మంద భాస్కర్ యాదవ్, రాష్ట్ర ఈసీ మెంబర్ కన్నూరి రాజు, వోడ్నాల లత, జిల్లా ప్రధాన కార్యదర్శి వోడ్నాల తిరుపతి, ఓమేష్, సంతోష్, ఎమ్మార్పీఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు కల్వల మల్లేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

**రామాయంపేట, అక్టోబర్ 26( ఇదే నిజం):** మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షుడు సుతారి శ్రీనివాస్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనను స్మరించుకున్నారు. వాల్మీకి జయంతి వేడుకల్లో వాల్మీకి బోయ సంఘం సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో కొనసాగింది. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం సభ్యులు కె. గట్టయ్య, స్వామి, నరసింహులు, రవి, పెంటయ్య, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి అభివృద్ధి కోసం
# రక్తదానంతో వినూత్న నిరసన

- ధర్నాలు, రాస్తారోకోలకు బదులుగా ఈ నెల 28న రక్తదానం
- టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్ రెడ్డి



**పాలేరు, అక్టోబర్ 26 :** పాలేరు నియోజకవర్గం సమగ్ర అభివృద్ధితో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న రక్తదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీడబ్ల్యూఎంఎఫ్ జిల్లా ఇన్‌చార్జి గుండా ఉపేందర్ రెడ్డి తెలిపారు. సాధారణంగా సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించే సంప్రదాయానికి భిన్నంగా, రక్తదానం ద్వారా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూసుమంచి మండలంతో పాటు పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించి పలు కీలక డిమాండ్లను ఆయన ముందుకు తెచ్చారు. కూసుమంచి మండల కేంద్రంలో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ నిర్మించాలని, అన్ని రకాల ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజధాని బస్సులకు కూసుమంచి బైపాస్ రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలో స్టాప్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలచే ఎన్నికైన వార్డు సభ్యులకు గ్రామాభివృద్ధిలో తగిన ప్రాధాన్యం కల్పించాలని ఉపేందర్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల్లో వార్డు సభ్యులను చేర్చడంతో పాటు, లబ్ధిదారుల ఎంపిక గ్రామపంచాయతీ సభ తీర్మానం ద్వారా పారదర్శకంగా చేపట్టాలని కోరారు. అర్హులైన వార్డు సభ్యులకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పాలేరు నియోజకవర్గాన్ని విద్యారంగంలో అభివృద్ధి చేసి ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని హాస్టళ్లను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యార్థులకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని, అన్ని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఉన్నత విద్యావకాశాలను మెరుగుపరిచేందుకు నియోజకవర్గంలో ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కూసుమంచి మండల కేంద్రంలోని శ్రీశ్రీశ్రీ గణపేశ్వరాలయం పక్కన ఉన్న శ్రీశ్రీశ్రీ ముక్కంటేశ్వరాలయానికి పునఃప్రతిష్ఠ చేపట్టి, రెండు ఆలయాలను అనుసంధానం చేయడం ద్వారా ఆ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స కోసం రోగులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. రాత్రి వేళల్లోనూ డయాలసిస్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో యంత్రాల సంఖ్య పెంచాలని, పాలేరు నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. నిరుద్యోగ యువతకు పోటీ పరీక్షల సన్నద్ధతకు అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు కూసుమంచి మండల కేంద్రంలో ఆధునిక డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం నగరాలకు వలస వెళ్తున్న యువత తక్కువ వేతనాలతో జీవనం సాగించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలకు పరిష్కారం చూపేందుకు సీతారామ ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడమే రక్తదాన కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గుండా ఉపేందర్ రెడ్డి తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇంట్లో చోరీకి యత్నం..

- అనుమానితుడిని పట్టుకున్న గ్రామస్తులు!
- కాకరవాయి గ్రామంలో ఘటన.. పోలీసులకు అప్పగింత



**తిరుమలాయపాలెం, అక్టోబర్ 26 :** ఖాళీగా ఉన్న ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించినట్లు అనుమానిస్తున్న వ్యక్తిని ఇంటి యజమాని, గ్రామస్తులు కలిసి పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కాకరవాయి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. కాకరవాయి గ్రామానికి చెందిన సలిగంటి లింగయ్య, హేమలత దంపతుల ఇంట్లో ఎవరూ లేని సమయంలో కామేపల్లి మండలానికి చెందిన బానోత్ సందీప్ (26) అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై అక్కడికి వచ్చినట్లు సమాచారం. అనంతరం ఇంట్లోకి ప్రవేశించి చోరీకి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదే సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన లింగయ్యకు ఇంట్లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అప్రమత్తమైన ఆయన చుట్టుపక్కల వారిని పిలిచాడు. గ్రామస్తుల సహకారంతో ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై లింగయ్య తిరుమలాయపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్సై పోగుల సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై

ఇళ్లలో ఎవరూ లేని సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై పోగుల సురేష్ సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, చోరీకి యత్నించినట్లు అనిపించినా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



# ప్రజావాణి అర్జీలను వెంటనే పరిష్కరించాలి

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావా ణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 133 దరఖాస్తులు ప్రజల నుండి అదనపు కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి, పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. అలాగే, స్వీకరిం చిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓట్ల తొలగింపు అనైతిక చర్య

- కేంద్రం కనుసన్నల్లోనే ఎన్నికల కమిషన్!
- కాళేశ్వరం ప్రాజెక్టుతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఎన్ని నీళ్లు ఇచ్చారో కేటీఆర్ చెప్పాలి
- రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు



**పెద్దపల్లి,ఇదే నిజం,అక్టోబర్ 26:** ఓటు హక్కును పరిరక్షించాలనే లక్ష్యంతో ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా చేపట్టిన 'ఓట్ బచావో -- దేశ్ బచావో' ప్రచార కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని రంగంపల్లి వద్ద ఉన్న ఆర్ఆర్ గార్డెన్స్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని కేంద్ర ప్రభుత్వంపై, ఎన్నికల కమిషన్‌పై విమర్శలు చేశారు. ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) పేరుతో దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు జరుగుతోందని, తెలంగాణలోనూ 73 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆయన ఆరోపించారు. ఎన్నికల కమిషన్ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో పనిచేస్తోందని విమర్శించారు. ఓటు అనేది ప్రతి పౌరుడి హక్కు అని, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించడం అనైతిక చర్య అని అన్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్‌కు ప్రశ్నలు..

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 నియోజకవర్గాలకు ఎంత మేర సాగునీరు అందించారో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేయాలని విజయరమణారావు డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి 20 వేల క్యూసెక్కుల నీరు వృథాగా దిగువకు వెళ్తోందంటూ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పరిస్థితిపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినగా, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ సమస్యలు తలెత్తాయని పేర్కొన్నారు. నాణ్యతాపరమైన లోపాలపై జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి వినతిపత్రం అందించారని తెలిపారు. బ్యారేజీల భద్రతపై నిపుణుల సూచనల మేరకే ప్రభుత్వం ముందుకు సాగుతోందని, అవసరమైన మరమ్మతులు చేపట్టి వచ్చే జూన్ నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. బ్యారేజీల్లో నీటిని నిల్వ చేయడంపై భద్రతా పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ హయాంలోనే సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎస్సారెస్పీ ద్వారా ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వాల పాత్ర ఉందని విజయరమణారావు పేర్కొన్నారు. కడెం, ఎల్లంపల్లి,శ్రీపాద ఎల్లంపల్లి,లోయర్ మానేరు డ్యామ్, మంజీరా,వరద కాలువ వంటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రస్తావించారు. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలించే పైప్‌లైన్ పనులు 2013లో పూర్తయ్యాయని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు చేపట్టారని, ఆ ప్రాజెక్టును కొనసాగించి ఉంటే సాగునీటి అవసరాలకు మరింత ప్రయోజనం కలిగేదని అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యత, ఖర్చులు, నీటి వినియోగంపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కన్నెపల్లి పంప్‌హౌస్, కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఏ నియోజకవర్గానికి ఎంత నీరు అందించారో వివరాలతో ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు.

### రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో తీసుకున్న నిర్ణయాలపై విజయరమణారావు విమర్శలు చేశారు. గోదావరి జలాల వినియోగం, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ విషయంలో రైతులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలను విజయరమణారావు తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శలు చేసే ముందు సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులు, వాటి ద్వారా రైతులకు కలిగిన ప్రయోజనాలపై మాట్లాడాలని సూచించారు. ఈ మీడియా సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమ ఏఐసీసీ పరిశీలకుడు ఎస్. శరత్, టీపీసీసీ పరిశీలకుడు కూన శ్రీశైలం గౌడ్, డీసీసీ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్‌తో పాటు మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, రామగుండం మేయర్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కరీంనగర్ మండల ప్రజావాణికి రెండు దరఖాస్తులు



**కరీంనగర్ (ఇదే నిజం )అక్టోబర్ 26 :** ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ కార్యక్రమానికి వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో ఆగస్టు 17న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఎంపీడీవో అశోక్ తెలిపారు. కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు మొత్తం 57 దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి మంచి అవకాశమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు తమ వ్యక్తిగత, స్థానిక సమస్యలకు సంబంధించి దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, నిబంధనల ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

- జెండా చౌరస్తా నుంచి పెద్ద మసీదు వరకు రాకపోకలకు అంతరాయం..
- ప్రజలు సహకరించాలి: మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య



**పెద్దపల్లి, ఇదే నిజం, అక్టోబర్ 26 :** పెద్దపల్లి పట్టణ అభివృద్ధిలో భాగంగా జెండా చౌరస్తా నుంచి పెద్ద మసీదు వరకు చేపట్టనున్న ప్రధాన రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆధ్వర్యంలో పట్టణంలో రహదారి విస్తరణ పనులు చేపడుతున్నట్లు . ఇందులో భాగంగా జెండా చౌరస్తా వద్ద డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్నందున జెండా చౌరస్తా నుంచి పెద్ద మసీదు వరకు రాకపోకలకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. డ్రైనేజీ, రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్న సమయంలో సంబంధిత రహదారిని తాత్కాలికంగా మూసివేయనున్నందున పట్టణ ప్రజలు, వాహనదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు. పట్టణ అభివృద్ధి, మెరుగైన రహదారి సౌకర్యాల కల్పన కోసం చేపడుతున్న ఈ పనులకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మంథని నర్సింగ్, టౌన్ ప్లానింగ్ అధికారి నరేష్, ఏఈ రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ సురేందర్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో విద్యారంగ అభివృద్ధికి రూ.70 కోట్లు

- టాస్క్ కేంద్రం ద్వారా 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు
- ప్రభుత్వ విప్ విజయరమణ రావు



**పెద్దపల్లి,ఇదే నిజం, 26 :** యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు తెలిపారు. పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో తరగతి గదుల పునరుద్ధరణ పనులు, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రం, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో రూ.2.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విజయరమణ రావు మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. టాస్క్ కేంద్రం ద్వారా గత ఏడాదిన్నరలో 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని, దీనికి సంబంధించిన వివరాలతో వారం రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 600 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, కళాశాలల్లో హాజరు నిబంధనలను కఠినంగా అమలు చేయాలని అధ్యాపకులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ సేవలు మెరుగుపడుతున్నాయని, ఇటీవల పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి నాలుగు అవార్డులు లభించాయని తెలిపారు. పేదలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, ఆర్డీవో, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, కళాశాల ప్రిన్సిపాళ్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# ప్రజావాణికి 18 దరఖాస్తులు

**కరీంనగర్( ఇదే నిజం )అక్టోబర్ 26 :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 18 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, విజ్ఞప్తులను సంబంధిత శాఖల అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 6, ఇందిరమ్మ పథకానికి సంబంధించి 7, ఇంజినీరింగ్ విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 3 దరఖాస్తులు అందాయి. వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజలు తమ వినతులను అధికారులకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ భరత్, అసిస్టెంట్ కమిషనర్ రాజా మనోహర్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కొడుకు పోషణ కల్పించేలా చర్యలు తీసుకోవాలి

### కలెక్టరేట్ ప్రజావాణిలో వృద్ధ దంపతుల వేడుకోలు



**కరీంనగర్ (ఇదే నిజం) అక్టోబర్.26 :** వృద్ధాప్యంలో తమను పోషించాల్సిన కుమారుడు పట్టించుకోవడం లేదని, తమకు న్యాయం చేసి కొడుకు చేరదీసేలా చర్యలు తీసుకోవాలని శంకరపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన వృద్ధ దంపతులు అధికారులను వేడుకున్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తమ గోడును వెల్లబోసుకున్నారు. తమ కుమారుడు సంపత్ మూడు ఎకరాల వ్యవసాయ భూమితో పాటు ఇంటిని ఆక్రమించుకొని తమను ఇంటి నుంచి బయటకు పంపించాడని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తమను ఆదుకోవాల్సిన కుమారుడే నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తమకు చెందిన వ్యవసాయ భూమి, ఇంటి విషయంలో న్యాయం చేయడంతోపాటు, కుమారుడు తమను చేరదీసి పోషించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వృద్ధాప్యంలో జీవనాధారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమ సమస్యను అధికారులు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



# గ్రామసభ నిర్వహించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన రాజారం బీఆర్ఎస్ నాయకులు

**తిరుమలాయపాలెం, అక్టోబర్ 26 :** ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని రాజారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గ్రామసభ నిర్వహించకుండా అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, వారి అనుచరులకే ఇళ్లు కేటాయిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ సమాన అవకాశం కల్పించాలని కోరారు. పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 6 ప్రకారం గ్రామసభ నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలనే డిమాండ్‌తో రాజారం గ్రామంలో పది శాతం మంది ఓటర్ల సంతకాలను సేకరించి ఈ నెల 19న గ్రామపంచాయతీ కార్యాలయంలో కార్యదర్శికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదుపై ఎంపీడీవో సానుకూలంగా స్పందించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గ్రామసభ నిర్వహించి లబ్ధిదారుల పేర్లను ఖరారు చేసేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# నవంబర్ 1న ఢిల్లీలో ఓటు చోరీకి నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

- ఓటు బచావో - దేశ్ బచావో పేర నిరసన ధర్నా
- కాంగ్రెస్ శ్రేణులకు ఏఐసీసీ పరిశీలకులు రంగరాజన్ మోహన్ కుమార మంగళం పిలుపు
- 2018 నుంచే బిజెపి ఓటు చోరీకి పాల్పడుతోందని విమర్శ



**మేడ్చల్:** బిజెపి 2018 నుంచే ఓటు చోరీకి పాల్పడుతున్న దని ఏఐసీసీ పరిశీలకులు రంగరాజన్ మోహన్ కుమార మంగళం అన్నారు. తద్వారా, ప్రజాస్వామ్యానికి తూట్లు పొందుతుందని విమర్శిం చారు. ఇది ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు మాత్రమే పరిమితమైన సమస్య కాదని, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనానికి త్రిలోధకాలు ఇస్తున్నదని మండిప డ్డారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను ఉపయోగించుకుని లక్షలాది ఓటర్లను తొలగిస్తున్నదని ఆరోపించారు. సోమవారం మేడ్చల్ జిల్లాలోని బోడుప్పల్లో డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ, నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ నిర్వహించను న్న ' ఓటు బచావో – దేశ్ బచావో ' ఆందోళన కార్యక్రమాన్ని జయప్ర దం చేయాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. టీపీసీసీ కో– ఆర్డినేటర్ అప్సర్ యూసఫ్ జాహీతో కలిసి రంగరాజన్ మోహన్ కుమార మంగళం మీడియాతో మాట్లాడు తూ, పార్టీ అధ్యక్షులు ఖర్గే, అధినాయకులు రాహుల్ గాంధీ ఆధ్వర్యం లో ఈ ఆందోళన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కుమార మంగళం తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, అర్హుడైన ప్రతి ఒక్క పౌరుడు ఓటు హక్కు కలిగి ఉండటం ప్రాథమిక హక్కు అని, అలాగే, ఎన్నికల ప్రక్రియను నిష్పక్ష పాతంగా నిర్వహించడం ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమనీ ఆయన పేర్కొంటూ, ఓటు చోరీ అనే సమస్య ఇప్పటిది కాదని 2018 మధ్యప్రదేశ్ ఎలక్షన్ల నుంచే బిజెపి ప్రారంభిం చిందన్నారు. ఆ ఎన్నికలో 7 లక్షల ఓట్లు తొలగించడమే ఇందుకు నిదర్శనం అన్నారు. అనంతరం మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, హర్యా నా రాష్ట్రాల్లో కూడా ఓటు చోరీనీ బిజెపి కొనసాగించిందన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినప్పటికీ, ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ ను తొలగించకపోవడం ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని మేధావులు, విద్యార్థులు, విపక్షాలు యువకులు ఆందోళనలు చేపడుతున్నా చర్యలు తీసుకోకపోవడం బిజెపి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమన్నారు. ఓటర్ల జాబితాల్లో పేర్ల చేర్పులు, తొలగింపులు, అనుమానాస్పద నమోదులు, ఎన్నికల సమాచార లభ్యత, ఈవీఎంలు, వీ.వీ ప్యాట్ల పనితీరు వంటి అంశాలపై సమగ్ర పరిశీలన చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లోపిస్తే ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న విశ్వాసం సన్నగిల్లుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలో ఓటర్ల సంఖ్య పెరుగుదలపై కాంగ్రెస్ లేవనెత్తిన ప్రశ్నలు, కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో ఓటర్ల నమోదుపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలు ఎన్నికల డేటా విశ్వసనీయతపై చర్చకు దారితీశాయనీ ఆయన చెబుతూ, ఓటర్ల జాబితాల్లోని అనుమానాస్పద నమోదులను గుర్తించి, వాటిపై స్వతంత్రంగా ధ్రువీకరించుకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందన్నారు. అయితే, ఓటర్ల సంఖ్య పెరుగుదల ఒక్కటే అక్రమాలకు నిదర్శనం కాదని, ఆరోపణలను సంబంధిత ఆధారాలతో నిర్ధారించాల్సిన అవసరం ఉందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారన్నారు. మరోవైపు, ఎన్నికల సంఘం స్వతంత్రత, కమిషనర్ల నియామక విధానం, అధికారుల జవాబుదారీతనం వంటి అంశాలు కూడా రాజకీయ చర్చలో ప్రాధాన్యం సంతరించుకున్నాయని, ఎన్నికల వ్యవస్థపై తలెత్తుతున్న సందేహాలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వడంతోపాటు, ఓటర్ల జాబితాలకు సంబంధించిన సమాచారాన్ని పారదర్శకంగా అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ కోరుతోందన్నారు. ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు. ఆ హక్కు వినియోగంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా చూడటం ఎన్నికల సంఘం బాధ్యత అన్నారు. ఆరోపణలు, ప్రత్యారోపణలకే పరిమితం కాకుండా, వాస్తవాలను ఆధారాలతో వెల్లడించి ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన అవసరం ఎన్నికల సంఘంపై ఉందన్నారు.

### బిజెపి ఎన్నికల సంఘాన్ని శిఖండిగా ఉపయోగించుకుంటుంది : వజ్రేష్ యాదవ్

మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, యు.పి, మహారాష్ట్ర లలో ఎం.పి, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఒక్కోరకంగా ఫలితాలు రావడం ఓటు చోరికి నిదర్శనమన్నారు. అలాగే, కలకత్తాలో ఏమి జరిగిందో ప్రజలు చూశారని, బిజెపి ఎన్నికల కమిషనర్ ను శిఖండిగా ఉపయోగించు కుని, ప్రతి రాష్ట్రాన్ని గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నదని విమర్శిం చారు. నాకు తెలియకుండానే నా ఓటును తీసివేస్తున్నారనీ, 80 ఏళ్ల తర్వాత జ్ఞానేష్‌ను ఎన్నికల కమిషనర్ గా పెట్టీ బిజెపి ఇలా చేస్తున్నదనీ ఆరోపించారు. మొదటి నుంచి మీము పోరాటం చేస్తూనే ఉన్నామనీ, ఎన్ని ఆందోళనలు చేపట్టినా బిజెపి ప్రభుత్వం ఒక్క వ్యక్తిని తొలగించడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నవంబర్ 1న ఢిల్లీని స్థబింపజే సేందుకు నిర్ణయం తీసుకుందని, దీనిని జయప్రదం చేయాలన్నారు. బిజెపి తర్వాత తెలంగాణను టార్గెట్ పెట్టుకున్నట్టు చెబుతున్నదని, కమిషన్ ఎన్నడూ లేని విధంగా నిబంధనలు పెట్టి ఓట్లను తొలగిస్తున్నదన్నారు. పార్టీ ఆందోళన నిర్ణయాన్ని మేడ్చల్ జిల్లా ప్రజల వద్దకు తీసుకు వెళ్తాం అన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు రాములు, నియోజక వర్గాల ఇంచార్జీ కొలను హనుమంత రెడ్డి, అలాగే భూపాల్ రెడ్డి, మహేష్ గౌడ్, బాల్ రెడ్డి, సత్యనారాయణ, నవీన్ రెడ్డి, సురేందర్ ముదిరాజ్, శంకర్ గౌడ్, తుంకి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు దాతృత్వపు చేయూత!

### అప్పాయిగూడెం పాఠశాలకు బల్లాలు, కుర్చీలు విరాళం..

### విద్యాభివృద్ధికి పులసం రామకృష్ణ కుటుంబం తోడ్పాటు

**కారేపల్లి :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో అప్పాయిగూడెం గ్రామానికి చెందిన పులసం రామకృష్ణ బల్లాలు, కుర్చీలను విరాళంగా అందజేశారు. కారేపల్లి మండల పరిధిలోని అప్పాయిగూడెం గ్రామ పంచాయతీకి చెందిన ఎంపీపీఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అవసరాలను గుర్తించి ఆయన అందించిన సహాయంపై పాఠశాల నిర్వాహకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంలో దాతల సహకారం ఎంతో కీలకమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ముందుకొచ్చి బల్లాలు, కుర్చీలు అందించిన పులసం రామకృష్ణ కుటుంబానికి పాఠశాల నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాత కుటుంబానికి భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి, ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు పగడాల మంజుల, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, ఎంఈఓ జయరాజ్, కాంప్లెక్స్ హెచ్ఎం సాల్మన్ రాజు, డీఆర్పీ లక్ష్మణ్, గ్రామ పెద్ద పులసం భద్రం, పాఠశాల హెచ్ఎం జి.సత్యవతి, జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**భువనగిరి :** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ,రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 127 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 65, సర్వే ల్యాండ్స్ 13, హౌసింగ్ 10,వైద్య ఆరోగ్య శాఖ 6, పంచాయతీ 5,ఉపాధి కల్పన 4, జిల్లా పరిషత్ 4,మున్సిపాలిటీ 3, వ్యవసాయ శాఖ 2,ఇరిగేషన్ 2, ఎల్.డి.యం, సివిల్ సప్లై, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ,మైన్స్,మెడికల్ కాలేజీ,పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్,విద్య, విద్యుత్, ఆర్ అండ్ బి, ఆర్టీసీ,డి.ఎల్.పి.ఓ, శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ లేకుండా ఎప్పటికపుడు డిస్పోస్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్,జెడ్పీ సీఈఓ శోభా రాణి, హౌసింగ్ పీడీ అలివేలు ,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## వాల్మీకి మహర్షి ప్రతి ఒక్కరికీ ఆదర్శం

### రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి

**భువనగిరి :** జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవిత విశేషాలను స్మరిస్తూ, రామాయణాన్ని రచించి ప్రపంచానికి నీతి, ధర్మం, మానవీయ విలువలను చాటిచెప్పిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం, ఆయన సాధించిన పరివర్తన ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, డిప్యూటీ కలెక్టర్లు కృతిక, సాత్విక్ ,జిల్లా బీసీ సంక్షేమ అధికారి సుబ్బారెడ్డి,ఎస్ సి కార్పొరేషన్ ఈ.డి శ్యాంసుందర్, కలెక్టరేట్ ఏ.ఓ అంజి రెడ్డి,వివిధ కుల సంఘ నాయకులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## 70వ ఎస్జిఎఫ్ అండర్-19 జిల్లా స్థాయి క్రికెట్ బాయ్స్ అండ్ గర్ల్స్ జట్ల ఎంపికలు

**నేరడుగొమ్ము :** నల్గొండ జిల్లా డీఐఈఓ ఆదేశానుసారము ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి (సూర్యాపేట,యాదాద్రి భువనగిరి,నల్లగొండ) ఎస్జిఎఫ్ అండర్–19 క్రికెట్ బాయ్స్ అండ్ గర్ల్స్ జిల్లా జట్ల ఎంపికలు మేకల అభినవ్ స్టేడియం, నల్గొండ జిల్లా యందు తేదీ:28/10/2026(బుధవారం )నాడు ఉదయం 8:00 గంటలకు నిర్వహించబడును. ఇట్టి క్రీడలలో ఆసక్తిగా పాల్గొనే క్రీడాకారులు(1) బోనఫైడ్ ఒరిజినల్ (2)10 వ తరగతి మెమో (3) ఆధార్ (4)డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ (5) ఎస్జిఎఫ్ ఎలిజిబిలిటీ ఫామ్ (విత్ హెచ్ఎం/ప్రిన్సిపాల్ అటెస్టేషన్) తో హాజరు కావలసిందిగా కోరుతున్నాము.హెచ్చరిక నకిలీ పత్రాలు సమర్పిస్తే ఎస్జిఎఫ్ఐ నిబంధనల ప్రకారం 2 నుండి 5 సంవత్సరాల పాటు పోటీల నుండి నిషేధించబడును. కే.ఇందిర.అండర్–19 ఎస్జిఎఫ్ ఆర్గనైజయింగ్ సెక్రటరీ నల్గొండ. నిర్వాహకులు కేతావత్ శ్రీను, సంప్రదించవలసిన నెంబర్లు 9704216525, 8096745465.

## సర్వీస్ అపార్ట్‌మెంట్.. 'సీక్రెట్' దందా!

- ముగ్గురు ఉజ్బెక్ మహిళల పట్టివేత..
- ఢిల్లీ నుంచి తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడి
- నాయక్ కోసం పోలీసుల వేట



**శేరిలింగంపల్లి :** సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను అడ్డాగా చేసుకుని వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్న అనుమానంతో కూకట్‌పల్లి ఎస్ఓటీ, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. చందానాయక్ తండాలోని ఓరియంట్ ఎలిగెంట్స్ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్ నంబర్ 201లో సోమవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో ముగ్గురు విదేశీ మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు ఉజ్బెకిస్థాన్‌కు చెందినవారిగా గుర్తించినట్లు మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో సరైన గుర్తింపు, ప్రయాణ పత్రాలు లేకుండా ఎవరైనా ఉంటున్నారా? అనుమానాస్పద కార్యకలాపాలు కొనసాగుతున్నాయా? అనే కోణంలో ఎస్ఓటీ, మాదాపూర్ పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో చందానాయక్ తండాలోని ఓరియంట్ ఎలిగెంట్స్‌లోని ఫ్లాట్ నంబర్ 201పై అనుమానంతో సోమవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. అక్కడ ఉన్న ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ముగ్గురు మహిళలు ఉజ్బెకిస్థాన్‌కు చెందినవారిగా గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు తెలిపారు. వారు నేపాల్ మీదుగా భారత్‌లోకి ప్రవేశించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న పాస్‌పోర్టులు, వీసాలు, ఇతర ప్రయాణ పత్రాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

### ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు..

పోలీసుల విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు తెలిపారు. గత నెలలో ముగ్గురు మహిళలను ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చి, 'నాయక్' అనే వ్యక్తి వారి ద్వారా వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు మహిళలు విచారణలో వెల్లడించినట్లు ఆయన తెలిపారు.నెల రోజులుగా నగరంలోనే ఉండి సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను కేంద్రంగా చేసుకుని ఈ వ్యవహారం కొనసాగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మహిళలను ఎవరు ఢిల్లీ నుంచి తీసుకొచ్చారు? వారికి వసతి ఎవరు కల్పించారు? వ్యభిచార కార్యకలాపాలకు సంబంధించి మరెవరైనా మధ్యవర్తులు ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### నాయక్ కోసం గాలింపు..

ఈ వ్యవహారానికి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న నాయక్ అనే వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకున్న తర్వాత ఈ వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు మహిళలను పోలీసులు మరింతగా విచారిస్తున్నారు. వారి భారత్ ప్రవేశం, ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన విధానం, అపార్ట్‌మెంట్ బుకింగ్, నిర్వాహకులతో సంబంధాలు తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు.

### నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక..

సర్వీస్ అపార్ట్‌మెంట్లు, గెస్ట్‌హౌస్‌లు, అద్దె గదులను నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. ఎవరికి పడితే వారికి గదులు అద్దెకు ఇవ్వకుండా వారి గుర్తింపు, చిరునామా, పాస్‌పోర్టు, వీసా తదితర ధ్రువపత్రాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే వసతి కల్పించాలని ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు సూచించారు.



## చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

### జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ సాయిచరణ్

**కనగల్ :** చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మూడో అదన జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సాయి చరణ్ అన్నారు. సోమవారం జి. యడవల్లి జిల్లా పరిషత్ ఫస్ట్ క్లాస్ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోక్సో, వివిధ చట్టంలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా 3వ అదనపు న్యాయమూర్తి మరియు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ కె. సాయి చరణ్ తేజ మాట్లాడుతూ విద్యార్థులకు పోక్సో చట్టం యొక్క ప్రాముఖ్యత, బాలల హక్కులు, బాలలపై జరిగే లైంగిక నేరాల నుంచి రక్షణ, వ్యక్తిగత భద్రత మరియు చట్టపరమైన రక్షణల గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా అనుచిత సంఘటన ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.విద్యార్థుల్లో చట్టాల పట్ల అవగాహన పెంపొందించి, బాలల భద్రతకు ప్రాధాన్యత కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమన్నారు. దీనిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి దొడ్డి విజయలక్ష్మి , ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భూదాన్ పోచంపల్లి :** అర్హులైన పేదల సొంతింటి కలను సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యం అని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారము భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. నిరుపేదలకు ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, వైస్ చైర్‌పర్సన్ కొయ్యడ రజిని–శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్లు పాక మల్లేష్ యాదవ్ ,కళ్లెం రాఘవరెడ్డి,కౌన్సిలర్లు, సర్పంచులు, మండల పార్టీ అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు వంగూరి పాండు,సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి,కో–ఆప్షన్ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, సీనియర్ నాయకులు,లబ్ధిదారులు , తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమ నాయకుల అరెస్టు

### హామీల అమలుకు డిమాండ్

**కట్టంగూర్ :** కట్టంగూరు పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ ఉద్యమకారుల అరెస్ట్ చేసారు. తెలంగాణ ఉద్యమ కారుల గుర్తించాలని చేలో హైద్రాబాద్ కార్యక్రమకు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తగా ఉద్యమ నాయకులను ఇండ్ల వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు తెలంగాణ రాష్ట్ర ఏరుపటు నిరంతరం పోరాటం చేసారు నాటి ఉద్యమ సమయంలో కేసు జెల్ జీవితం అనుభవించి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు కాంగ్రేస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చినా హామీల అమలు చేయాలని ఉద్యమ చేస్తున్న సమయంలో అనేక మంది అమ–రుల ఐనరు మరి కొందరు ప్రమాదాలతో అంగవైకల్యం ఏరుపడి ఆర్థిక సమస్యలతో బాధపడే కుటుంబాలు అనేకం వున్నాయి ఉద్యమ చేసిన ప్రతి ఉద్యమ కారుని గుర్తించి కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగ భద్రత కల్పించాలని నాటి స్వతంత్ర ఉద్యమము లో పని చేసిన వారికీ ప్రభుత్వాల అన్నీ వసతులు కల్పించ యని అన్నారు. కార్యక్రమంలో గద్దపాటి



దానయ్య మాజీ రెఫరం డం సర్పంచ్ సీనియర్ నాయకులు గాదగోని వెంకన్న పాతూరి రెడ్డి కోమటి భాస్కర్ రేకల బిక్షం తదితరులు పాల్గొన్నారు



పని చేయడాన్ని యంత్రానికి అప్పగించడం సాంకేతిక పురోగతి కావచ్చు. కానీ ఆలోచించడాన్ని కూడా యంత్రానికే అప్పగిస్తే? ప్రతి ప్రశ్నకు సమాధానం ఏఐలో వెతుకుతూ.. ప్రతి నిర్ణయానికి దాని సలహాపై ఆధారపడుతూ.. చివరకు స్వయంగా ఆలోచించే సామర్థ్యాన్నే కోల్పోతే? ఏఐ వల్ల మనిషి చేతులకు విశ్రాంతి రావచ్చు.. కానీ మెదడుకు విశ్రాంతి అలవాటైతే మాత్రం ప్రమాదమే.

ఒకప్పుడు యంత్రాలు మనిషి చేతికి పనిముట్లు. ఇప్పుడు అవే ఆలోచనలకు తోడుగా మారాయి. 'ఏఐ మనకు ఎంత ఉపయోగపడుతుంది?' అనే ప్రశ్న నుంచి.. 'రేపు మనిషి అవసరం ఎంత మేరకు ఉంటుంది?' అనే ప్రశ్న వరకు పరిస్థితి చేరింది. రాయాలన్నా ఏఐ.. లెక్కించాలన్నా ఏఐ.. విశ్లేషించాలన్నా ఏఐ.. చివరకు నిర్ణయం తీసుకోవడానికీ ఏఐ సలహానే! పని వేగాన్ని పెంచి, సమయాన్ని ఆదా చేసి ఎన్నో అవకాశాలను అందిస్తున్న ఏఐ.. మనిషి జీవితంలో అంతర్భాగంగా మారుతోంది.

# ఏఐ మనిషి ఆలోచనలకు కృత్రిమ సంకెళ్లు!

## సొంత ఆలోచనకు స్వస్తి.. ప్రతి పనికీ ఏఐపై ఆధారం..

### ఆటోమేషన్‌తో మారుతున్న కొలువులు.. కలవరపెడుతున్న కృత్రిమ మేధ

### మనిషి సృష్టించిన కృత్రిమ మేధస్సు (ఏఐ).. ఇప్పుడు మనిషి ఆలోచనా శక్తికే సవాల్ విసురుతోంది




### ఆలోచనకు బదులు.. అరచేతిలో సమాధానం

ఒకప్పుడు తెలియని విషయం తెలుసుకోవాలంటే పుస్తకాలు తిరగేసేవాళ్లం. పెద్దలను అడిగేవాళ్లం. చర్చించేవాళ్లం. తప్పులు చేసేవాళ్లం.. వాటి నుంచి నేర్చుకునేవాళ్లం. ఆ ప్రక్రియలో పరిజ్ఞానంతో పాటు అనుభవం, విచక్షణ కూడా పెరిగేవి. ఇప్పుడు ప్రశ్న పుట్టకముందే సమాధానం సిద్ధంగా ఉంది. వ్యాసం రాయాలన్నా ఏఐ.. ప్రసంగం సిద్ధం చేయాలన్నా ఏఐ.. అసైన్‌మెంట్ చేయాలన్నా ఏఐ. ఇది సౌకర్యమే. కానీ అదే సౌకర్యం సొంత ఆలోచనకు ప్రత్యామ్నాయంగా మారకూడదు. ముఖ్యంగా యువత ఏఐని ఉపయోగించే తీరు ఆలోచించాల్సిన అంశం. ఏఐ ఇచ్చే సమాధానం కంటే.. దాన్ని ప్రశ్నించే మెదడు మనిషికి అవసరం. ఏఐ చెప్పిందంటే నిజమేనని నమ్మకుండా.. 'ఇది సరైందా? ఆధారం ఏమిటి? మరో కోణం ఉందా?' అని ఆలోచించాలి.

### లేఆఫ్‌ల వెనుక.. ఎన్నో జీవితాలు

ఏఐ ప్రభావం ఆలోచనా విధానానికే పరిమితం కాదు. ఉపాధి రంగాన్నీ ప్రభావితం చేస్తోంది. ఆటోమేషన్, ఏఐ ఆధారిత వ్యవస్థలతో కొన్ని పనుల స్వరూపం మారుతోంది. కొన్ని ఉద్యోగాల్లో మానవ అవసరం తగ్గుతుండగా.. కొత్త నైపుణ్యాల అవసరం పెరుగుతోంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం 'ఫ్యూచర్ ఆఫ్ జాబ్స్ రిపోర్ట్ 2025'లో 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల సృష్టి, తొలగింపు రెండూ భారీ స్థాయిలో చోటుచేసుకునే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇది ఉద్యోగ మార్కెట్‌లో రానున్న మార్పుల తీవ్రతను సూచిస్తోంది. కానీ ఇది కేవలం గణాంకాల కథ కాదు.

**ప్రతి ఉద్యోగం వెనుక ఒక కుటుంబం ఉంటుంది.**
**ప్రతి జీతం వెనుక ఒక జీవితం ఉంటుంది.**
**ప్రతి లేఆఫ్ వెనుక ఒక కల ఉంటుంది.**

అయితే ఏఐ వచ్చిందంటే అన్ని ఉద్యోగాలూ పోతాయని చెప్పడం కూడా వాస్తవికం కాదు. గత సాంకేతిక మార్పుల మాదిరిగానే కొన్ని పనులు తగ్గి.. కొత్త పనులు పుట్టుకొచ్చే అవకాశం ఉంది. అసలు ప్రశ్న.. పాత ఉద్యోగాలు మారే వేగానికి అనుగుణంగా కొత్త నైపుణ్యాలు, కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయా? అన్నదే.

### కొలువుకు డిగ్రీతో పాటు.. కొత్త నైపుణ్యాలు

భవిష్యత్తు ఉద్యోగ ప్రపంచంలో కేవలం డిగ్రీ సరిపోదు. యంత్రం చేయగల పనిని యంత్రం వేగంగా చేయగలదు. అందుకే సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, కమ్యూనికేషన్, నాయకత్వం, మానవ సంబంధాలను అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలకు ప్రాధాన్యం పెరగనుంది. అందుకే యువత ఏఐని చూసి భయపడాల్సిన అవసరం లేదు. ఏఐని ఉపయోగించడం నేర్చుకోవాలి.. అదే సమయంలో ఏఐ లేకుండానూ ఆలోచించడం నేర్చుకోవాలి. విద్యా వ్యవస్థ కూడా మారాలి. ఏఐతో సమాధానం రాబట్టే విద్యార్థి కంటే.. ఏఐ ఇచ్చిన సమాధానాన్ని ప్రశ్నించే విద్యార్థిని తయారు చేయడం ముఖ్యం.

### యంత్రానికి వేగం.. మనిషికి విచక్షణ

ఏఐ ఎంత తెలివైనదైనా.. అది మానవ అనుభవానికి, భావోద్వేగానికి, విలువలకు పూర్తిస్థాయి ప్రత్యామ్నాయం కాదు. యంత్రం సమాచారాన్ని విశ్లేషించగలదు.. సమాధానాన్ని రూపొందించగలదు.. పరిష్కారాన్ని సూచించగలదు. కానీ ఆ పరిష్కారం సరైనదా? సమాజానికి మేలు చేస్తుందా? మానవ విలువలకు అనుగుణంగా ఉందా? అన్నది నిర్ణయించాల్సింది మనిషే. అందుకే ఏఐ యుగంలో అత్యంత అవసరమైనది కేవలం సాంకేతిక పరిజ్ఞానం కాదు.. విచక్షణ.

ఏఐ చెప్పినదాన్ని అంగీకరించడం కాదు.. ప్రశ్నించాలి. పరిశీలించాలి. ఆధారాలను తనిఖీ చేయాలి. నిజానిజాలను నిర్ధారించాలి. మరో కోణంలో ఆలోచించాలి.

### ఏఐతో నడవాలి.. ఏఐ వెంట నడవకూడదు

మనిషి తన మేధస్సుతో యంత్రాన్ని సృష్టించాడు. ఆ యంత్రం వేగాన్ని, సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలి. కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి. కానీ సౌకర్యం కోసం స్వయంగా ఆలోచించే అలవాటును మాత్రం వదులుకోకూడదు. ఏఐని నిరాకరించడం పరిష్కారం కాదు.. ఏఐకి బానిస కావడం కూడా పరిష్కారం కాదు.
ఏఐని ఉపయోగించాలి.. కానీ విచక్షణను కోల్పోకూడదు.
ఏఐని నమ్మాలి.. కానీ ప్రశ్నించడం ఆపకూడదు.
ఏఐతో పని చేయాలి.. కానీ సొంత ఆలోచనను వదులుకోకూడదు.
భవిష్యత్తులో పోటీ మనిషికి–యంత్రానికి మధ్య మాత్రమే ఉండదు. యంత్రాన్ని తెలివిగా ఉపయోగించే మనిషికి.. యంత్రంపై పూర్తిగా ఆధారపడే మనిషికి మధ్య కూడా ఉంటుంది. ఎందుకంటే మానవాళికి అతిపెద్ద ముప్పు యంత్రం తిరుగుబాటు చేయడమే కానవసరం లేదు. మనిషి తనంతట తానే ఆలోచించడం మానేసిన రోజే.. యంత్రం విజయం సాధించినట్టే.

**యంత్రం ఎంత తెలివిగా మారినా పరవాలేదు..**
**మనిషి తన ఆలోచనను మాత్రం కోల్పోకూడదు.**
**ఏఐ మనిషిని నడిపించకూడదు..**
**మనిషే ఏఐకి దిశానిర్దేశం చేయాలి.**
**అదే సాంకేతిక పురోగతికి అసలైన అర్థం..**
**అదే మానవ మేధస్సుకు అసలైన విజయం.**

– జి. అజయ్ కుమార్



## సీతమ్మ పాత్ర అని చెప్పగానే.. ఏమీ ఆలోచించలేదు : సాయి పల్లవి

'రామాయణ'లో సీతమ్మ పాత్రలో నటించడం తనకెంతో ప్రత్యేకమైన అనుభవమని హీరోయిన్ సాయిపల్లవి చెప్పారు. సినిమా ప్రచారంలో భాగంగా రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి 'కౌన్ బనేగా కరోడ్‌పతి 18' కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారు. ఈ సినిమాలో అవకాశం రావడం ఎలా అనిపించిందనే ప్రశ్నకు సమాధానమిచ్చారు. సాయిపల్లవి మాట్లాడుతూ.. సాధారణంగా తాను ఏ సినిమాలో నటించినా.. ఆ పాత్రకు తనవంతుగా ఏం చేయగలనని ఆలోచిస్తానని చెప్పారు. అయితే సీతమ్మ పాత్ర విషయంలో మాత్రం అలా చేయలేదన్నారు. "నేను ఈ పాత్ర గురించి ఎక్కువగా ఆలోచించాలనుకోలేదు. సీతమ్మగా నటించడం వల్ల నేను ఎంత జ్ఞానాన్ని సొంతం చేసుకోగలననే విషయాన్ని మాత్రమే చూశా. నాకు తెలిసిన కొన్ని అంశాలను కూడా పక్కనపెట్టా. 'అమ్మా.. నాతో ఈ పాత్ర నువ్వే చేయించుకో' అని సీతమ్మను ప్రార్థించి సెట్స్‌లోకి అడుగు పెట్టా" అని వివరించారు. ఆమె మాటలను విన్న అమితాబ్ బచ్చన్.. చాలా బాగా చెప్పారంటూ ప్రశంసించారు. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కించిన 'రామాయణ' చిత్రంలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ రావణుడిగా, రవి దూబే లక్ష్మణుడిగా కనిపించనున్నారు. హనుమంతుడి పాత్రలో సన్నీ దేవోల్ నటిస్తున్నారు. ఈ ఇతిహాసాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగం 2026 నవంబరు 5న విడుదల కానుంది.

# మా వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దు

## విజయ్ సతీమణి రష్మిక



**విజయ్ దేవరకొండతో వివాహ బంధంపై సామాజిక మాధ్యమాల వేదికగా వస్తున్న వార్తలను నటి, విజయ్ సతీమణి రష్మిక ఖండించారు. తమ వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని హెచ్చరించారు. జరిగింది ఏంటో పూర్తిగా తెలుసుకోకుండా అరకొర సమాచారంతో ఓ నిర్ణయానికి రావొద్దని హితవు పలికారు. ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఇటీవల ప్రసారమైన 'కాఫీ విత్ కరణ్' షోలో ఈ జోడీ పాల్గొని అనేక విషయాలను ముచ్చటించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. 'రష్మిక పెళ్లి చేసుకోమని నన్ను 100 సార్లు అడిగింది' అని అన్నారు. దీనిపై విజయ్‌ను విమర్శిస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టులు మొదలయ్యాయి. ఈ క్రమంలో రష్మిక స్పందిస్తూ పెళ్లి ప్రతిపాదన తెచ్చినప్పుడు విజయ్ సమయం తీసుకోవడం తప్పేం లేదని అన్నారు. అతనిపై తనకు పిచ్చి ప్రేమ ఉందని తెలిపారు. తాము ఒకరినొకరం ఎంచుకున్నామని వివరించారు.**

"ప్రియమైన ఇంటర్నెట్ ప్రజలారా..! సాధారణంగా ఇలాంటి విషయాలకు స్పందించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ తమ అభిప్రాయాన్ని తెలిపే హక్కు ఉంటుంది. మేము ఇచ్చిన ఇంటర్వ్యూకు వస్తున్న స్పందన చూస్తుంటే, మేం ఏం చెప్పామో అర్థం చేసుకోవడం కంటే, ఎవరినో ఒకరిని తప్పుబట్టడంపైనే ఎక్కువమంది ఆసక్తి చూపిస్తున్నట్లు అనిపించింది. ఆ షోలో మా మధ్య జరిగిన సంభాషణ 'మేము ఎవరికి ఎన్నిసార్లు ప్రపోజ్ చేసుకున్నాం? పెళ్లి చేసుకోవడానికి అంత సమయం ఎందుకు పట్టింది?' అన్న విషయాలు గురించి కాదు. నేను పెళ్లి ప్రతిపాదన తెచ్చినప్పుడు విజయ్ సమయం తీసుకోవడంలో తప్పేమీ లేదు. ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోవడానికి, జీవితంలోని ఒడిదొడుకులను కలిసి ఎదుర్కోవడానికి మేము సిద్ధంగా ఉన్నామో లేదో తెలుసుకోవడానికి తగినంత సమయం తీసుకోవడం ఎప్పుడూ ముఖ్యమే" "తన జీవితంలో ఏం కావాలో విజయ్‌కు బాగా తెలుసు. ఒక పెద్ద నిర్ణయం తీసుకునే ముందు ఎవరైనా సరే ఆలోచిస్తారు. విజయ్ తన మనసు చెప్పినట్లు నడుచుకుంటాడు. జీవితాన్ని చూసే మా భిన్నమైన దృక్పథాలే మా బంధాన్ని మరింత బలంగా ఉంచుతాయి. పెళ్లి అనేది ఎప్పుడూ ఒక గొప్ప ప్రతిపాదన. ఏదో ఉంగరాలు మార్చుకోవటం, వేడుకలు చేసుకోవడం వంటి విషయాలకు సంబంధించింది కాదు. ఇద్దరూ కలిసి జీవితాన్ని నిర్మించుకోవడం ముఖ్యం. అందుకే మేము మా ఇద్దరినీ ఎంచుకున్నాం. అవును..! విజయ్ అంటే నాకు పిచ్చి ప్రేమ. అందులో తప్పేముంది?ఇదేమీ చెడ్డ విషయం కాదు కదా! నేను పెళ్లి చేసుకోబోతున్న వ్యక్తిని గాఢంగా ప్రేమించకపోతే, అసలు అతడిని ఎందుకు పెళ్లి చేసుకుంటాను"

"ఒకప్పుడు నాతో స్నేహంగా, ప్రేమగా ఉన్న వారు నేను కష్టాల్లో ఉన్నప్పుడు నా పక్కన లేరు. ఆ సమయంలో విజయ్ నాకు అండగా నిలిచాడు. ఇప్పటికీ ఆ మద్దతు కొనసాగుతూనే ఉంది. నా జీవితానికి సంబంధించిన విషయాల్లో నేను చెబుతున్న మాటల కంటే, ఇంటర్నెట్‌లో ప్రచారమయ్యే ఊహాగానాలు, ఎడిట్ చేసిన వీడియోలు, నిరాధారమైన వార్తలు ఎక్కువ నమ్ముతున్నారు. ఇలాంటి వాటిని కొందరు ఇష్టపడటం నిజంగా భయంగా అనిపిస్తోంది. నేను బాధలో ఉన్నప్పుడు, నాకు సలహా అవసరమైనప్పుడు, భద్రత కావాలనుకున్నప్పుడు, ఓదార్పు, మద్దతు అవసరమైనప్పుడు మీరెవరూ నా పక్కన లేరు.. ఉండరు.. కానీ, అతను (విజయ్) ఉంటాడు" "ప్రస్తుతం నా జీవితంలో ఎన్నడూ లేనంత సంతోషంగా ఉన్నా. పెళ్లి తర్వాత నేను అనుభవిస్తున్న సంతోషాన్ని మీరు కూడా చూడగలరని ఆశిస్తున్నాను. నేను ఎంతో అదృష్టవంతురాలిని. నా కుటుంబం గురించి పూర్తిగా తెలియకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఫెమినిజం ముసుగులో జరుగుతున్న వేధింపు మాత్రమే. పదేళ్లుగా నాపై ప్రేమను కురిపిస్తూ, ఆదరిస్తున్నందుకు అభిమానులకు కృతజ్ఞతలు" అని రష్మిక పేర్కొన్నారు.



# వరుస ఆఫర్లతో సంయుక్త మీనన్ హవా

టాలీవుడ్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా సంయుక్త మీనన్ పేరే వినబడుతోంది. బెంజ్, బ్లాక్ గోల్డ్, స్వయంభు, స్లమ్ డాగ్, హైందవ అని ఒకటా రెండా.. తమిళ, తెలుగు అని తేడా లేకుండా చేతినిండా ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఈ భామ ఖాతాలో ఇప్పుడు మరో క్రేజీ ఆఫర్ పడినట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. నందమూరి బాలకృష్ణ, కొరటాల శివ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ సినిమాలో హీరోయిన్ సంయుక్తను ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. అయితే గతంలో వీరి కాంబినేషన్‌లో వచ్చిన 'అఖండ-2' అనుకున్న స్థాయిలో మ్యాజిక్ చేయలేకపోయింది. అయినప్పటికీ, కొరటాల శివ సంయుక్తపై నమ్మకంతో ఆమెనే హీరోయిన్‌గా అనుకోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో ఈసారైనా కొరటాల ప్రాజెక్ట్‌తో సంయుక్తకు లక్ కలసొచ్చి, బాలయ్య సరసన సాలిడ్ బ్లాక్‌బస్టర్ అందుకుంటుందో లేదోనని అందరి దృష్టి దీనిపై పడింది. ఈ క్రేజీ మూవీ షూటింగ్ నవంబర్ మొదటి వారంలోనే గ్రాండ్‌గా ప్రారంభం కానుండగా, మైండ్ బ్లాకింగ్ యాక్షన్ సీన్స్ కోసం ఓ భారీ సెట్‌ను కూడా రెడీ చేస్తున్నట్లు సమాచారం.




# వివాదంలో ప్రభాస్ 'ఫౌజీ'!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. ఈ చిత్రంలో ఇమాన్వి ఇస్మాయిల్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. బాలీవుడ్ దిగ్గజాలు మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్, చైత్ర జె. ఆచార్ కీలక పాత్రలో కనిపించబోతున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ ఫిల్మ్స్ అత్యంత గ్రాండ్‌గా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాను 2027 మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇక ఇటీవల ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా.. మేకర్స్ పవర్ ఫుల్ పోస్టర్‌తో పాటు గ్లింప్స్ విడుదలై చేసి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. కానీ 'ఫౌజీ' సినిమా ఊహించని చిక్కుల్లో పడింది. గ్లింప్స్‌లో చూపించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాత్రపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. నేతాజీ మునిమనవడు చంద్రకుమార్ బోస్ ఈ విషయంపై స్పందిస్తూ దర్శకుడు హను రాఘవపూడిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సినిమాలో చారిత్రక వాస్తవాలను పూర్తిగా వక్రీకరించారని ఆయన ఆరోపించారు. ముఖ్యంగా హిట్లర్‌తో నేతాజీ భేటీ అయిన సన్నివేశాన్ని చూపించిన తీరు ఆయన గౌరవాన్ని తగ్గించేలా ఉందని, దీనిపై చిత్రబృందం భారత ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సృజ నాత్మక స్వేచ్ఛ పేరుతో చరిత్రను తప్పుగా చూపించడం సరికాదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈ వివాదం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారడంతో.. నెటిజన్లు సైతం ఆయనకు సపోర్ట్‌గా నిలుస్తూ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

# లాభాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఓ వైపు అంతర్జాతీయంగా చమురు ధరలు గరిష్ఠ స్థాయిల వద్ద కొనసాగుతున్నప్పటికీ.. ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 72,990.04 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,123.83) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటి తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ.. చివరికి 482.92 పాయింట్ల లాభంతో 73,606.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.20 పాయింట్ల లాభంతో 22,753.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.19గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా, ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4018 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.



## బిజినెస్



## ఇక కౌంటర్ టికెట్లకూ 45 పైసలకే 10 లక్షల బీమా

భారతీయ రైల్వే ప్రయాణికులందరికీ ట్రావెల్ ఇన్సూరెన్స్ స్కీమ్ వర్తించనుంది. ఇప్పటివరకు కేవలం ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులకు మాత్రమే ట్రావెల్ ఇన్సూరెన్స్ ఆప్షన్ ఉండేది. ఇకపై ఆఫ్‌లైన్‌లో రైల్వే కౌంటర్ల వద్ద టికెట్లు కొనుగోలు చేసిన ప్రయాణికులకూ ఈ సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని సుప్రీంకోర్టు భారతీయ రైల్వేను ఆదేశించింది. అక్టోబర్ 27 నుంచి అమల్లోకి తేవాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ప్రయాణికుడు టికెట్‌పై 45 పైసలు అదనంగా చెల్లిస్తే రూ.10 లక్షల బీమా కవరేజీ లభిస్తుంది. ఇది కేవలం ప్రయాణికుడి ఆప్షన్ మాత్రమే, తప్పనిసరి కాదు. యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రాధా యాదవ్ కేసులో సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇన్సూరెన్స్‌లో భాగంగా రైలు ప్రమాదం లేదా ఇతర అవాంఛనీయ సంఘటనల వల్ల ప్రయాణికుడు మరణించినా లేదా తీవ్రంగా గాయపడి శాశ్వత అంగవైకల్యానికి గురైనా గరిష్ఠంగా రూ.10 లక్షల బీమా వస్తుంది. శాశ్వతంగా పాక్షిక అంగవైకల్యం బారిన పడితే.. రూ.7.5 లక్షల పరిహారం అందుతుంది. ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.2 లక్షలు, మృతదేహాన్ని తరలించేందుకు రూ.10 వేలు చెల్లిస్తారు. అయితే ఈ ప్రీమియం తీసుకునే ప్రయాణికులు కచ్చితంగా మొబైల్ నంబరును రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ప్రీమియాన్ని డిజిటల్ పేమెంట్ పద్ధతిలోనే చెల్లించాల్సి ఉంటుంది. టికెట్ ఛార్జీలతో కలిసి దీన్ని వసూలు చేస్తారు. నమోదు చేసుకున్న ఫోన్ నంబరుకు బీమా వివరాలు అందుతాయి.

# భారత్ సిరీస్‌ను పట్టేస్తుందా?

## వెల్లింగ్టన్ 'గాలి' ఎవరి వైపో?
## సూర్యవంశీకి మళ్లీ ఛాన్స్

**వెల్లింగ్టన్ :** భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ముంగిట ఓ అద్భుతమైన అవకాశం. సారథ్యం చేపట్టాక తొలిసారి విదేశీ గడ్డపై సిరీస్‌ను నెగ్గే గొప్ప ఛాన్స్. వెల్లింగ్టన్ మైదానంలో కివీస్‌తో మంగళవారం జరగబోయే మూడో టీ20లో విజయం సాధిస్తే సిరీస్ దక్కుతుంది. మిగిలిన రెండు మ్యాచులను ప్రయోగాలకు వేదికగా మార్చేసుకుంటే సరి.. న్యూజిలాండ్‌తో ఐదు టీ20ల సిరీస్.. అదీనూ వారి సొంత మైదానాల్లో అనగానే భారత అభిమానులు కాస్త కలవర పడ్డారు. అసలే పేస్, బౌన్సీ పిచ్‌లు కదా కుర్రాళ్లతో కూడిన మన జట్టు ఎలా ఆడుతుందోనని సంశయించారు. అందరి అంచనాలకు భిన్నంగా టీమ్‌ఇండియా ఇటు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో కివీస్ కంటే మెరుగైన ప్రదర్శనతో వరుసగా రెండు మ్యాచుల్లో గెలిచింది. కివీస్ బలం పేస్ బౌలింగే. కానీ, గత మ్యాచ్‌లో ప్రధాన పేసర్లు గాడి తప్పారు. ఇక కీలకమైన మూడో టీ20కి ముందు న్యూజిలాండ్‌కు పెద్ద దెబ్బే తగిలింది. మాట్ హెన్రీ, లాకీ ఫెర్గూసన్ గాయం కారణంగా వైదొలిగారు. మరోవైపు కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ భారత్‌కు అత్యంత ప్రమాదకారిగా మారాడు. రెండో టీ20లో నాలుగు వికెట్లు తీసి టీమ్‌ఇండియాను చావుదెబ్బ కొట్టాడు. ఆఖర్లో మన తెలుగు కుర్రాళ్లు ఎదురొడ్డి నిలిచి గెలిపించారు కాబట్టి సరిపోయింది. శాంట్నర్‌తోపాటు స్పిన్ ఆల్‌రౌండర్ బ్రాస్‌వెల్ కూడా ఇబ్బంది పెట్టాడు.



### కూర్పు అదేనా.. ఆర్డర్ ఏమైనా మారేనా?

ఇషాన్ కిషన్ గాయం కారణంగా మూడో టీ20 మ్యాచ్‌కూ దూరమని ఇప్పటికే బీసీసీఐ స్పష్టం చేసింది. మరోవైపు గత రెండు మ్యాచుల్లో విఫలమైన భువనేశ్వర్‌పైనా మేనేజ్‌మెంట్ దృష్టిపెట్టనుంది. అలాగని పక్కన పెట్టకపోవచ్చు. ఇక ఇషాన్ ప్లేస్‌లో వైభవ్ సూర్యవంశీకి మళ్లీ ఛాన్స్ ఖాయమే. మేనేజ్‌మెంట్ ముందున్న మరొక సమస్య.. వైభవ్ ప్లేస్‌మెంట్. అతడికి తుది జట్టులో స్థానం కల్పిస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లో ఎక్కడ పంపించాలనేది చిక్కు ప్రశ్నే. వైభవ్‌కు వన్‌డౌన్ పెద్దగా నప్పలేదు. రెండో టీ20లో అతడు ఇబ్బంది పడటం చూశాం. సంజును డౌన్ చేసి.. వైభవ్‌ను అభిషేక్ శర్మకు ఓపెనింగ్ జత చేస్తే ఫలితం కాస్త మారొచ్చేమో.

### కీలకం కానున్న గాలి ప్రభావం

వెల్లింగ్టన్‌లో పిచ్‌తోపాటు మరొక అంశంపై ఆటగాళ్లు దృష్టి పెట్టాలి. పిచ్ ఎలాగూ స్వింగ్‌కు అనుకూలం. ఈ స్టేడియం నిర్మాణం కూడా ప్రత్యేకమైనది. గుండ్రని ఆకారంలో, పాక్షిక పైకప్పుతో నిర్మించిన మైదానం. అందుకే, ఇక్కడ గాలుల ప్రభావం కాస్త ఎక్కువే. బంతి మరింత స్వింగ్ అయ్యే అవకాశం ఉంది. బ్యాటర్లు తొందరపడితే వికెట్ సమర్పించుకోవడం ఖాయం. టాస్ కూడా అత్యంత కీలకం. పవర్‌ప్లేలో వికెట్లను కాపాడుకొనే జట్టే పైచేయి సాధించేందుకు అవకాశం ఉంది. ఇలాంటి పిచ్‌పై భువీ ప్రమాదకర బౌలర్. అతడు వికెట్లకు రెండు వైపులా స్వింగ్ చేయగలడు.



## కేటుగాళ్ల కొత్త పన్నాగం
### ఐఫోన్ డ్యుయోపై 25% డిస్కౌంట్..

యాపిల్ ఐఫోన్లకు ఉన్న క్రేజ్ ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇటీవలే కంపెనీ తొలి ఫోల్డబుల్ ఐఫోన్ డ్యుయో విక్రయాలు మొదలయ్యాయి. ఈ ఐఫోన్ తక్కువ ధరకు వస్తుందంటే.. టెక్ ప్రియులు కొనుగోలు చేయడానికి ఎగబడతారు. ఈ అవకాశాన్ని కొందరు సైబర్ నేరగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు . డిస్కౌంట్స్, ప్రీ ఆర్డర్ ఆఫర్స్ పేరిట ప్రకటనలు చేస్తూ బురిడీ కొట్టిస్తున్నారు. ఐఫోన్ డ్యుయోపై 25 శాతం డిస్కౌంట్లు ఉన్నట్లు ప్రకటనలు చేస్తున్న నకిలీ సైట్లను ఖుంజూవతీంఎఎ గుర్తించింది. 'ఫోల్డబుల్ ఐఫోన్‌పై డిస్కౌంట్లు పరిమితంగానే ఉన్నాయి. త్వరగా ప్రీ ఆర్డర్లు చేసుకోవాలి' అని కేటుగాళ్లు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు తెలిపింది. వినియోగదారుల వాట్సప్ ఖాతాలకు సంబంధించిన ఫోన్ నంబర్లు, ఈమెయిల్ వివరాలను సేకరిస్తున్నట్లు హెచ్చరించింది. నేరుగా బ్యాంకు వివరాలు సేకరించనప్పటికీ, వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కితే భవిష్యత్తులో పెద్ద మోసాలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



## భారత్ మమ్మల్ని ఒత్తిడికి గురి చేసింది : బ్రాస్‌వెల్

సొంత గడ్డపై వరుసగా రెండు టీ20ల్లో న్యూజిలాండ్ ఓడిపోయింది. భారత్‌తో ఐదు టీ20ల సిరీస్ రేసులో నిలవాలంటే మంగళవారం జరగబోయే మూడో మ్యాచ్‌లో కివీస్ కచ్చితంగా నెగ్గాలి. మూడో టీ20కి వెల్లింగ్టన్ వేదిక కానుంది. ఇప్పటికే స్టార్ పేసర్లు మాట్ హెన్రీ, ఫెర్గూసన్ గాయం కారణంగా కీలక సమయంలో దూరం కావడం ఆ జట్టుకు పెద్ద దెబ్బే. ఈ క్రమంలో కివీస్ స్పిన్ ఆల్‌రౌండర్ మైకెల్ బ్రాస్‌వెల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. గత మ్యాచుల్లో టీమ్‌ఇండియా తమను ఒత్తిడిలోకి నెట్టిందని అంగీకరించాడు. అయితే, ఆ ఓటముల్లోనూ సానుకూల అంశాలను నేర్చుకున్నట్లు వెల్లడించాడు. "ఈ సిరీస్ చాలా ఉత్సాహంగా సాగుతోంది. గత రెండు మ్యాచుల్లో పొరపాట్లు చేశాం. ఇప్పటి వరకు జరిగిన టీ20ల్లోనూ చివరి వరకూ పోరాడాం. ఓటముల నుంచి పాఠాలు నేర్చుకుని బరిలోకి దిగుతాం. వెల్లింగ్టన్‌లో విజయం సాధించి మళ్లీ సిరీస్ రేసులోకి వస్తాం. అంతర్జాతీయ క్రికెట్‌లో టీమ్‌ఇండియా టాప్. ఇలాంటి జట్టును ఓడించాలంటే అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించాలి. గత కొన్నేళ్లుగా మేం ఇలానే ఆడుతున్నాం. కానీ, ఈ రెండు మ్యాచుల్లో పూర్తిస్థాయిలో ప్రదర్శన చేయలేకపోయాం. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో ఇంకాస్త మెరుగ్గా రాణించాలి. ఈ సిరీస్‌లో మమ్మల్ని టీమ్‌ఇండియా ఒత్తిడికి గురిచేసిందనేది అంగీకరించాలి. డెత్ ఓవర్లలో మా బ్యాటింగ్ లైనప్‌ను వారి బౌలర్లు బాగా అడ్డుకొన్నారు. అదే సమయంలో ఆ జట్టు బ్యాటర్లు బాగా ఆడారు. నా స్పెల్ చివరి బంతిని ఓసారి గమనిస్తే.. భారీ సిక్స్‌ను భారత బ్యాటర్ కొట్టాడు. ఒకవేళ అతడి మిస్‌టైమ్ అయితే నాకు వికెట్ లభించేది. కానీ, అలా జరగలేదు. టీ20 క్రికెట్‌లో ఇలాంటి చిన్నవే పెద్ద ప్రభావం చూపిస్తాయి. ఇక రాబోయే చావోరేవో మ్యాచుల్లో సత్తా చాటుతాం" అని బ్రాస్‌వెల్ అన్నాడు.

## రోహిత్ శర్మ వర్కౌట్లు చేయడన్నది
# కేవలం భ్రమే: సోహమ్ దేశాయ్

టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ 39 ఏళ్ల వయసులోనూ మైదానంలో చురుగ్గా ఉంటున్నాడు. గతంతో పోలిస్తే స్లిమ్‌గానూ మారాడు. అంతకుముందు పెద్దగా వర్కౌట్లు చేసేవాడు కాదని.. ఇప్పుడే వాటిపై దృష్టిపెట్టినట్లు కొందరు వ్యాఖ్యలు చేశారు. కానీ, అదంతా అవాస్తవమని భారత మాజీ కండీషనింగ్ అండ్ స్ట్రెంగ్త్ కోచ్ సోహమ్ దేశాయ్ స్పష్టం చేశారు. 2017లో తుంటి గాయంతో బాధపడిన రోహిత్.. అప్పట్నుంచి వారానికి రెండుసార్లైనాస్ట్రెంగ్త్ ట్రైనింగ్‌లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న రోహిత్.. వచ్చే ఏడాది 50 ఓవర్ల క్రికెట్ వరల్డ్ కప్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. "చాలా మంది రోహిత్‌ను.. లావుగా ఉంటాడు.. ఫిట్‌నెస్ కోసం ఏమీ చేయడని అంటుంటారు. కానీ, వారు అర్థం చేసుకోవాల్సిన విషయం ఒకటుంది. కెరీర్‌నే ప్రమాదంలోకి నెట్టేలా 2017లో రోహిత్ గాయపడ్డాడు. ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో తుంటికి తీవ్రగాయమైంది. శస్త్రచికిత్సలూ చేయించుకున్నాడు. అతడి హిప్ చాలా బలహీనంగా మారింది. వారానికి కనీసం రెండుసార్లు స్ట్రెంగ్త్ సెషన్స్ చేయించుకోకపోతే చాలా ఇబ్బంది. దాదాపు తొమ్మిదేళ్ల నుంచి క్రమం తప్పకుండా చేస్తున్నాడు. ఒకవేళ అతడు కష్టపడేవ్యక్తి కాకపోతే.. బద్ధకస్థుడైతే.. ఇన్నాళ్లు జట్టులో ఉండేవాడు కాదు. ఇప్పటి వరకు అతడు చేసిన పరుగులు, ఐపీఎల్‌లో జట్టును నడిపించడం, సంవత్సరం మొత్తం ఆడటమనే విషయాలను మరిచిపోయారు" అని సోహమ్ వ్యాఖ్యానించారు. "విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఫిట్‌నెస్ కసరత్తులకు సంబంధించి చాలా వ్యత్యాసం ఉంది. రోహిత్ ఎక్కువగా స్ట్రెంగ్త్ బేస్‌డ్‌గా చేస్తాడు. విరాట్ ట్రైనింగ్ భిన్నమైంది. అతడు ఎక్కువగా బరువులు ఎత్తుతాడు.



గాయం కారణంగా రోహిత్ అలాంటివి చేయకూడదు" అని సోహమ్ తెలిపారు.



## ఈవీలపైనే కొనుగోలుదార్ల చూపు

ద్విచక్ర వాహనదారుల్లో దాదాపు 43 శాతం మంది విద్యుత్ వాహనం(ఈవీ) వైపు చూస్తున్నారని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్(బీసీజీ) తన నివేదికలో పేర్కొంది. 2024లోని 30 శాతం మందితో పోలిస్తే ఇది ఎక్కువని పేర్కొంది. అలాగే ఈవీలను నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తున్న వారి సంఖ్య కూడా 38 శాతం నుంచి 29 శాతానికి తగ్గిందని చెప్పుకొచ్చింది. మెట్రో, నాన్‌మెట్రో నగరాల్లో 1600 మందిని సర్వే చేసిన అనంతరం ఈ నివేదికను వెలువరించింది. ఏప్రిల్-ఆగస్టు 2026లో మొత్తం ద్విచక్ర వాహనాల విక్రయాల్లో విద్యుత్ ద్విచక్ర వాహనాల వాటా 9.9 శాతానికి చేరిందని, 2023-24లో ఇది 5.5 శాతంగానే ఉందని తెలిపింది. స్కూటర్లలో విద్యుత్ ఈవీల వ్యాప్తి 16.8% నుంచి 24.1 శాతానికి చేరిందని వివరించింది. 'ప్రతీ నెలా 1.8 లక్షల మంది భారతీయులు తమ తొలి విద్యుత్ ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేస్తున్నారు. దేశంలో విక్రయమవుతున్న ప్రతీ 4 స్కూటర్లలో ఒకటి విద్యుత్‌దే'నని తెలిపింది.

## 'కృష్ణ దాస్' లైవ్ కాన్సర్ట్‌లో విరాట్ దంపతులు

అమెరికాకు చెందిన సంగీత విద్వాంసుడు, గాయకుడు కృష్ణదాస్ 'లైవ్ కీర్తన' కాన్సర్ట్ ముంబయిలో జరిగింది. ఈ కార్యక్రమంలో భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ దంపతులు పాల్గొన్నారు. అనుష్క శర్మ తన్మయత్వంతో గానాన్ని ఆస్వాదిస్తూ కనిపించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. కృష్ణ దాస్ భారత పర్యటనలో ఈ సంగీత కచేరీ ఒక భాగం.



Printer, publisher and Owned by **NASKANTI LAXMINARAYANA**, Published from 2-596, Sainagar, old Hafeezpet, serlingamplly,,HYDERABAD, TELANGANA-500049. Printed from **NALIVELI EXPRESS**, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH-518380. Editor: **NASKANTI LAXMINARAYANA**, PRGI NO **TGTEL/25/A4524**. Ph no.**9492652230**. website : www.idenijamdaily.com.